ప్రచురణ సం. 1953
ప్రథమ ముద్రణ
ఫిబ్రవరి 1953
ద్వితీయ ముద్రణ
మే 1955
తృతీయ ముద్రణ
జూలై 1958
చతుర్థ ముద్రణ :
జూలై 1961.
పంచమ ముద్రణ
మే 1966

వెల : రూ. 1-50

ముద్రణ :
రమణా ప్రింటర్స్, విజయవాడ-1.

ప రి చ యం



"ఆకులందున అణగి మణగి
కవిత కోయిల పలుకవలెనోయ్;
పలుకులను విని దేశమందభి
మానములు మొలకెత్తవలెనోయ్!"

*ఆధునిక ఆంధ్ర సాహిత్యానికి శ్రీ వీరేశలింగం పంతులుగారు యుగపురుషులు. ఈ ప్రభాతకాలంలోనే శ్రీ గురజాడ అప్పారావుగారి రచనలు నూతన విజ్ఞాన భానూదయకాంతులు ప్రసరింపజేశాయి. వీరి రచనలు సంఖ్యలో స్వల్పమే అయినా సాటిలేనివి. కవులకు అపూర్వ మార్గాన్ని చూపించాయి. ప్రజల్లో దేశభక్తిని రేకెత్తించాయి. భాషలో భావంలో విప్లవాన్ని సాధించాయి.

నవ్యాంధ్ర సాహిత్యానికి యుగకర్త అయిన శ్రీ అప్పారావుగారు 1861 విశాఖజిల్లా రాయవరం గ్రామంలో జన్మించారు. విజయనగరం కాలేజీలో చదివి 1886 లో బి. ఏ. పరీక్ష ప్యాసయ్యారు. వీరు చదువుకుంటూన్న రోజుల్లోనే, ఇంగ్లీషులో కవిత్వం వ్రాసి పత్రికల్లో ప్రచురిస్తుండేవారు. పట్టభద్రులు కాకపూర్వమే 1884 లో విజయనగరం కాలేజీలో కొన్నాళ్ళు ఉపాధ్యాయులుగా పనిచేశారు. కాని, అప్పుడు వారికిచ్చే జీతం నెలకు పాతిక రూపాయలుమాత్రమే. ఈ స్వల్పజీతంతో సంతృప్తి కలిగిందికాదేమో, తర్వాత కొన్నాళ్ళు డిప్యూటీకలెక్టరు ఆఫీసులో హెడ్‌క్లర్కుగాచేరారు. కాని, విజ్ఞానపిపాసియైన ఆ మహనీయునికి గుమాస్తాపని ఎంతకాలం సరిపోతుంది? అయిదారు నెలల్లోనే ఆ గుమాస్తాపనికి స్వస్తిచెప్పి, కాలేజీలో మళ్ళీ లెక్చరరుగా ప్రవేశించారు. జీతంహెచ్చి వంద రూపాయలకు పెరిగింది. ఉపాధ్యాయవృత్తిలో ఉన్నంతకాలంజీతపు రాళ్ళనే తన జీవితపరమావధిగా ఎంచుకోక, విద్యార్థుల విజ్ఞాన వికాసానికు ప్రత్యేకించి కృషిచేస్తూండేవారు. అందువల్లనే విద్యార్థులకు వీరెంతో ప్రీతిపాత్రులయ్యారు.

---

* శ్రీ. శే. వాసిరెడ్డి వాసుదేవరావుగారు మొదటి ముద్రణకు వ్రాసిన పరిచయం యిది.

కన్యాశుల్కము :

ఉపాధ్యాయుడుగా ఉన్న సమయంలోనే (1896) వీరు 'కన్యాశుల్కం' రచించారు. కన్యాశుల్కం రెండవ కూర్పు పీఠికలో, ఆ నాటకరచనకు తానెందువల్ల ఉపక్రమించవలసి వచ్చిందో, అప్పారావుగారే స్వయంగా ఇలా చెప్పారు.

"సంఘ సంస్కరణోద్యమాన్ని బలపరచడానికి, తెలుగుభాష నాటకరంగానికి అనుకూలమైనది కాదన్న అపోహ నిర్మూలించడానికీ, నేను కన్యాశుల్కాన్ని రాశాను."

బ్రహ్మసమాజ వాదాలు ఆంధ్రదేశంలోని విద్యావంతుల్లో విరివిగా ప్రచారమవుతున్న రోజులవి. సంఘసంస్కరణకు శ్రీ వీరేశలింగం పంతులుగారు కంకణంగట్టి పనిచేస్తున్నారు. అదే సమయంలో అప్పారావుగారు కూడా తన సాహిత్యంద్వారా సంఘ దురాచార నిర్మూలనకు పూనుకున్నారు. అయినా అప్పారావుగారు తమరచనల్లో కళ కేమాత్రం లోపం రానివ్వలేదు. ఆనాటి వ్యక్తులు తమ సహజమైన ఆచారవ్యవహారాలతో కన్యాశుల్కంలో నేటికీ మనకు కండ్లకు గట్టినట్లు సజీవంగా కనిపిస్తారు. గిరీశంలాంటి పాత్రలను ఆంధ్రదేశం ఎన్నటికీ మరచి పోలేదు. హాస్యరసపోషణలో కూడా వీరిది అందెవేసినచెయ్యి. కన్యాశుల్కం చదివినవారుగాని, చూచినవారుగాని కడుపు చెక్కలయ్యేటట్లు నవ్వకుండా వుండలేరు. అర్ధశతాబ్దికి పూర్వమే మన తెలుగులో యింతటి చక్కని నాటకం వచ్చినందుకు ఆంధ్రజాతి నిజంగా గర్వించదగిన విషయం. ఏవో కొన్ని స్వల్పలోపాలున్నా ఈ నాటికి మన సాహిత్యంలో దీనికి మీదైన నాటకం రాలేదనే చెప్పాలి. ప్రదర్శన యోగ్యంగా వుండేందుకు అప్పారావుగారు దీన్ని ఇంకా సంక్షిప్తం చేయాలని ప్రయత్నించారు. కాని, శరీరం కలసిరాలేదు. ఇదే పద్ధతిలో ప్రారంభించబడిన 'కొండుభట్టీయం' అనే మహానాటకంకూడా అసంపూర్తిగానే వుండిపోయింది

వాడుక భాష:

కన్యాశుల్క రచనానంతరం అప్పారావుగారి ఆరోగ్యం చెడిపోయి నందువలన వారికి విశ్రాంతి నిచ్చేందుకు విజయనగరం ఆనందగజపతి మహారాజుగారు, అప్పారావుగారిని 1896 జూన్‌లో లెక్చరరు పదవినుంచి తప్పించి సంస్థాన శాసన పరిశోధకునిగా నియమించారు.

ఆ సమయంలో అప్పారావుగారు అనేక చారిత్రక విషయాలను పరిశోధించారు. కళింగదేశచరిత్ర రాయడానికి కూడా పూనుకున్నారు. కాని ప్రముఖులైన విజ్ఞానవంతులంతా గ్రంథమంతటినీ గ్రాంథిక భాషలోనే ఆ గ్రంథం ఉండాలని పట్టుబట్టారు. కాని అందుకు అప్పారావుగారు అంగీకరించలేదు. "నాది ప్రజల పక్షం. దానిని ఎవరిని సంతోష పెట్టడానికి వదులుకోలేను" అని ఖచ్చితంగా సమాధానమిచ్చారు. అర్థ శతాబ్ది గడిచిన తరవాత నేటికీ ఆంధ్రవిశ్వవిద్యాలయం చేయలేని పనిని ఆనాడే అప్పారావుగారు చేసిచూపారు. వాడుకభాష ప్రచారానికి శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు చేసిన అమూల్యసేవను ఆంధ్రజాతి ఎన్నటికీ మరచిపోలేదు. పండిత ప్రకాండులలో [illegible] బాగా గద్దించి వ్యావహారికభాషా ప్రచారావశ్యకతను, దాని ప్రాశస్త్యాన్ని రుజువుచేస్తున్న సమయంలో అప్పారావుగారు, వాడుకభాషలో చక్కని రచనలు సాగించి వారిమార్గాన్ని సుగమతరం చేశారు. ప్రజాసామాన్యంతో సాహిత్యానికి సన్నిహిత సంబంధం ఏర్పరిచారు.

ఉత్తమ కథావేత్త:

"కొత్తపాతల మేలుకలయిక"తోపాటు, అప్పారావుగారి రచనల్లో కమ్మని తెలుగుదనం ప్రతిబింబిస్తూ ఉట్టిపడుతుంది. కొద్దిమాటల్లోనే భావాన్ని సూటిగా గుండెకు తగిలేట్టు చెప్పుతారు. 'పూర్ణమ్మ', 'కన్యక' లాంటి గేయాలు యిందుకు చక్కని వుదాహరణలు. ఇవి చదువుతూవుంటే పాఠకుని హృదయం జలదరిస్తుంది. కన్నీటి బొటబొట కారుతుంది. 'కాసులు' అనే ఖండకావ్యంలో

"మరులు ప్రేమని మది దలంపకు
మరులు మరలును వయసుతోడనె
మాయ, మర్మము లేని నేస్తము
మగువలకు మగవారి కొక్కటె
బ్రతుకు సుకమును రాజమార్గము
ప్రేమనిచ్చిన ప్రేమవచ్చును
ప్రేమనిలిపిన ప్రేమనిలుచును".

అని చెప్పి ఆదర్శప్రేమ అంటే ఏమిటో చక్కగా నిర్వచించారు.

సంఘ సంస్కరణప్రియుడైన భర్తను ఒక సామాన్యకుటుంబం లోని స్త్రీ ఏవిధంగా భావిస్తుందో 'ముత్యాల సరములు' లో సహజంగా చిత్రించారు. అమాయకురాలైన ఈమె మాటలకు పాఠకునికి కోపం రాకపోగా వర్ణాశ్రమ ధర్మశృంఖలాలు ఈమెను ఎంతగా బంధించి వేశాయో చూచి జాలివేస్తుంది.

'లవణరాజు కల' జ్ఞానవాసిష్ఠంలోనిది అయినా—మహాకవి దానికి ఒక అపూర్వశోభను చేకూర్చారు. అవాస్తవిక విషయమైనా, దీన్ని చదువుతూ ఉన్నంతసేపు పాఠకుడు వాస్తవిక జగత్తులోనే విహరిస్తున్నాననుకుంటాడు.

గ్రీకుకథ కథావస్తువుగా తీసుకొని రచింపబడిన "డామన్ పితియస్" అను పద్యకథానికలో ఆదర్శమైత్రిఅంటే ఏమిటో నిరూపించారు.

'లంగ రెత్తుము', 'దించు లంగరు' అనేవి రెండూ, ప్రథమ ప్రపంచ యుద్ధజ్వాలలు ప్రపంచాన్ని ఆవహించుకుంటూన్న కాలంలో వ్రాయబడినవి.

ము త్యా ల స ర ం :

ప్రతిభానిధియైన ఈ మహాకవి ఆంధ్రభాషకు "ముత్యాలసరం" అనే చక్కని ఛందస్సును ప్రసాదించారు. వసుచరిత్రాది ప్రబంధాల్లోవాడబడిన

"బాల బాలరసాల మిది పిక
పాలి తాలిటి యమరసాలము
ఖేలి గేలిడి గ్రుచ్చు గమ రా
గిల్లు గిల్లుము తత్ప్రవాలము"

ఈ వృషభగతి రగడలోని నాలుగవ పంక్తిలో కొన్ని మాత్రలు తగ్గించినచో ఈ ఛందస్సు ఏర్పడుతుంది. "గుమ్మడేడే గోపిదేవీ" లాటి పాటలు ఇంతకు పూర్వమేవున్నా. దీనిని ప్రచారంలోకి తెచ్చింది శ్రీ గురజాడవారే, ప్రజల వాడుకభాషలో వ్రాయబడి, మృదుమధురమైన పదాల పొందికతో, ఇంపుసొంపులు గులుకు గురజాడవారి 'ముత్యాల సరాలు' మన ఆంధ్రభాషాపేటికకి నిజంగా ముత్యాల సరాలే!

దేశభక్తి :

అప్పారావుగారిలో మొదటినుంచీ బ్రహ్మసమాజ భావాలతోపాటు జాతీయ భావాలుకూడా ప్రబలంగా ఉండేవి. 1887 లోనే కాంగ్రెసు మీటింగులకు వెళ్ళి, ఉపన్యాసాలిస్తూండేవారు. అప్పారావుగారి ప్రతి రచనలోను సంఘసంస్కరణాప్రియత్వం స్పష్టంగా ద్యోతకమవుతుంది.

"మలినదేహుల మాల లనుచును
మలినచిత్తుల కధిక కులముల
నెలవొసంగిన వర్ణ ధర్మ
మధర్మ ధర్మందే"

అని చాటారు. మతంపేరిట జరుగుతున్న మోసాలను ఎత్తి చూపారు. సంఘవృద్ధికి వేరుపురుగుగాపరిణమించిన ప్రతి మూఢ విశ్వాసాన్ని ఖండించారు. తోకచుక్క రావడంవల్ల ఏదో పెద్ద ముప్పు కలుగుతుందని బెదరిపోయేవారికి, ఎలాంటిసమాధానమిచ్చారో చూడండి:

"తెగులు కీడని కరల పన్నుచు
దిగులుచెందు టిదేటికార్యము
తలతు నేనిది సంఘ సంస్కర
ణ ప్రయాణ పతాకగాన్"

వీటి అన్నిటికీ మించినది అప్పారావుగారి 'దేశభక్తి' అనేగేయం. ఇందులోని ఒక్కొక్క పాదం నిజంగా ఒక్కొక్క ముత్యంలాంటిది. ఈ గేయం ఒక్కటి చాలు : అప్పారావుగారిని అమరజీవిని చేయడానికి. భారతదేశంలో అనేకజాతీయగీతాలు వచ్చాయి. కాని, వాటిలో దేనికి అప్పారావుగారి గీతంలోని భావగాంభీర్యంలేదు. బంకించంద్రుని 'వందే మాతరం' గానీ, రవీంద్రుని 'జనగణమన' గాని, ఇక్బాల్ రచించిన

'హిందూస్థాన్ హమారా' గాని 'దేశమును ప్రేమించుమన్నా' గీతానికి ఏమాత్రం తీసికట్టు రాదేమో.

ఈ గీతాన్ని అప్పారావుగారు 1910 లో రచించారు. ఈ నాడు మన విశాలాంధ్ర పల్లెపల్లెలో ఈ గీతం మారుమోగుతుంది. యువకుల్లో దేశభక్తిని రేకెత్తిస్తోంది.

"దేశాభిమానం నాకు కద్దని
వట్టి గొప్పలు చెప్పుకోకోయ్
పూని యేదైనాను ఒక మేల్
కూర్చి జనులకు చూపవోయ్"

అని జాతీయవాదులను హెచ్చరిస్తోంది.

"స్వంతలాభం కొంత మానుకు
పొరుగువానికి తోడు పడవోయ్
దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుజులోయ్"

అని కర్తవ్యాన్ని ఉపదేశిస్తోంది.
మతంపేరిట గొడవలు లేకుండా.

"అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయ్"

అని హిందూముస్లిం సోదరులకు పదేపదే చెప్పుతూఉంది.

"మందగించక ముందు అడుగేయ్
వెనుకబడితే వెనకేనోయ్"

అంటూ ఎప్పటికప్పుడు నూతనోత్సాహాన్ని యిచ్చి ముక్కోటి ఆంధ్రులను ముందుకు నడిపిస్తూవుంది.

ఈ విధంగా ఆంధ్రజాతి కంఠానికి 'మేలుకొలుపు' పాడిన ఈ అభ్యుదయ మహాకవి 1915 నవంబరు 30 తేదీన 54 సంవత్సరాల వయస్సులోనే యీ జీవితయాత్ర ముగించారు. దీనితో మన ఆంధ్ర సాహిత్యం యింకెంత పొందవలసి వుండేదో !

—వాసిరెడ్డి భాస్కరరావు.

పరిచయం

ఆదికాలంలో తిక్కన. మధ్యకాలంలో వేమన. ఆధునికకాలంలో గురజాడ మన తెలుగులో మహాకవులు. రసజ్ఞహృదయంగల ఏవరో ఏ ఒక్కరికీ మహాకవి స్థానం నిరాకరించలేము. తెలుగువారికి ప్రాతినిధ్యం వహించారు. తెలుగు వాతావరణం ప్రత్యేకతను ప్రదర్శించడంలోనే వీరి ఔన్నత్యం ఉన్నాయి. క్లుప్తంగా, విస్తృతంగా కావ్యగ్రంథాలు వ్రాయలేకపోయినా గురజాడను లోకం విస్మరించలేదు. "నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు. తళుకు బెళుకు రాళ్ళు తట్టెడేల" అన్న వేమన్న వాక్కు గురజాడ విషయంలో అక్షరాలా అన్వయిస్తుంది. గురజాడవారి కవిత్వం మొత్తం ఒక సన్నని చిన్న సంపుటాన్ని నింపలేకపోయిందే అనిగాని, వారు ఇంకా ఎక్కువగా రాస్తే ఎన్ని అమూల్యనిధులు లభ్యమయ్యేవో అని గాని మనం చింతించనక్కరలేదు. గురజాడ రచనలన్నీ నశించిపోయి ఒక్క "దేశభక్తి" గీతం మిగిలినా వారిని తెలుగు ప్రపంచ కవుల్లో ఒక్కడుగా లెక్కించదగిన మహాకవి అని నిర్ణయించవచ్చును.

ఎంపిక చేస్తే "దేశభక్తి" గీతం సమస్త ప్రపంచ మానవుల జాతీయగీతం. రామాయణ భారతాది ఇతిహాసాలకున్న విలువ ఈ ఒక్క గీతానికే ఉందని అంటే కొందరు ఆశ్చర్యం పొందుతారేమో! కాని అక్షరసత్యమైన యథార్థం ఇది. కాలం గడుస్తున్నకొద్దీ బలం సంతరించుకునే కొద్దిపాటి మహాకావ్యాలలో ఒకటిగా దీనిని గుర్తించక తప్పదు. ఒక తెలుగుకవి ప్రపంచానికిచ్చిన కవిత్వపు కానుక ఇది. మానవుని ఆధ్యాత్మికయాత్రలో "భగవద్గీత"కు గల ప్రత్యేకస్థానం వంటిది గురజాడ "దేశభక్తి" గీతానికి. ఒక కాలానికి. ఒక స్థలానికి పరిమితం కాని సందేశం ఇచ్చేది ఈ గీతం. [illegible] ప్రశాంతంగా ధ్వనిస్తూనే సింహం చేసే క్ష్వేళాధ్వనిని స్ఫురింపజేస్తుంది. ఈ గీతం అని ఇదివరకొకచోట నేను వ్రాశాను. ఏకకాలంలో ప్రధానస్వరంగాను, తాంతానస్వరంగాను కూడా మానవత్వాన్ని ఉపదేశించడం ఈ గీతం ప్రత్యేకత.

ఒకే ఒక్క ఛందస్సులో వేమన్న తన సందేశాన్ని వినిపించాడు. అలాగే గురజాడ కూడ "ముత్యాలసరం"లో తన భావాలన్నిటిని ప్రసారం చేశాడు. ("పుత్తడిబొమ్మ పూర్ణమ్మ" ఛందస్సు మాత్రం ఈ సామాన్య సూత్రానికి అపవాదంగా నిలుస్తుంది.) ఆటవెలది ఛందస్సును స్వయంగా సృష్టించకపోయినా వేమన్న దానిని తన సొంతం చేసుకున్నట్టే గురజాడకూడా జానపద జీవితంలో ఒదిగిఉన్న ముత్యాల సరాన్ని తనది చేసుకున్నాడు. "ముత్యాలసరం" అనే నామధేయంకూడ గురజాడ పెట్టినదే. గణబద్ధ ఛందస్సుల ఫ్యూడలిజం నుండి మాత్రా బద్ధ ఛందస్సుల ప్రజాస్వామ్యయుగానికి ఆంధ్రసాహిత్య చరిత్ర గమనాన్ని పరివర్తన చేసినవాడు గురజాడ.

ఇది ప్రజాస్వామ్యయుగం అని అందరూ అంగీకరించినా (కనీసం ఈ దేశంలో) ప్రగతినిరోధక తత్వానిదే ప్రస్తుతం మట్టుకు పైచేయిగా కనిపిస్తోంది. అందువల్లనే యావద్భారతానికే కాదు సకల ప్రపంచానికీ అలంకారప్రాయుడైన ఒక మహాకవికి తాను జన్మించిన రాష్ట్రంలోనే సరియైన ప్రచారం జరగకుండా పోతోంది. తమిళులు తమ సుబ్రహ్మణ్య భారతినిగూర్చి సగర్వంగా చెప్పుకుంటారు. మళయాళీలు వళ్లత్తోల్ మహాకవికి బ్రహ్మరథం పడతారు. ఇక వంగీయులు వారితోబాటు భారతీయులు రవీంద్రనాథుడే ప్రపంచం అంతటికీ ఏకైక మహాకవి అని ఉద్ఘోషిస్తారు. వీరిలో ఏ ఒక్కరికీ తీసిపోడు సరికదా మన గురజాడ వీరెవ్వరికీ సాధ్యంకాని మహాకార్యం సాధించాడు. అదే "కన్యాశుల్కం" రచన. నాటకం సాహిత్యానికి పరాకాష్ఠ అని అందరూ అంగీకరించినదే. సృష్టికి ప్రతిసృష్టివంటిది నాటక రచన. శూద్రకకవి మృచ్ఛకటికం రచించిన తర్వాత మళ్ళీ భారతదేశంలో దానితో తుల తూగేదీ, కొన్ని విషయాలలో మించిపోయేదీ (వసంతసేనకంటే మధురవాణి గొప్పసృష్టి) "కన్యాశుల్కమే" అని నిస్సందేహంగా చెప్పవచ్చును. రవీంద్రుని నాటకాలు నాటకాలేకావు. అతని కవిత్వమే ముసుగు మార్పులతో అక్కడకూడా ప్రత్యక్షమవుతుంది. నూటికినూరు పాళ్ళు కవిత్వంతో నిండిన కాళిదాసు నాటకాలు నాటకాలుగా నిలుస్తాయి.

కన్యాశుల్కం కూడా అంతే. అందులో ఉన్న కవిత్వం జీవితంలోనుంచి సరాసరి వెల్లువికి వచ్చేసి.

ఈ దృష్టిని చూస్తే "పూర్ణమ్మ కథ" నాకొక ఏకాంక విషాదాంత నాటికగా కనబడుతుంది. అలాగే "లవణరాజుకల"లో Midsummer Night's Dream కనబడుతుంది. 'పూర్ణమ్మ'లో ఉన్నంత భావతీవ్రత చదువుతూ వుంటే కన్నంట నీళ్ళు తెప్పించేశక్తి "కన్యక"లో లేకపోయినా, అందులోని కథనంకూడా నాటకీయంగానే సాగుతుంది. తిక్కనకీ గురజాడకీ సమాన ధర్మం ఈ నాటకీయ కథనంలోనే ఉంది. ఇద్దరూ తాము వర్ణించే సంఘటనలను graphic గానే కాక cinematographic గా చిత్రిస్తారు.

"కన్నుల కాంతులు కలువల చేరెను
మేలిమి చేరెను మేని పసల్ ;
హంసల జేరెను నడకల బెడగులు
దుర్గను చేరెను పూర్ణమ్మ"

ఒక మహాకావ్యాన్ని చదివి ముగించిన అనుభూతి ఈ పద్యంలో మనకి లభిస్తుంది.

కళ్ళకు కట్టేవిధంగా దృశ్యాలను చిత్రించడం ఒక్కటే కవికి లక్షణంకాదు. అతని భావవాహిని నవ్యమైన మార్గాలు పట్టిందా లేక పెడదారులు తొక్కిందా అన్నదికూడా ఆలోచించవలసిన విషయం. ఈ విషయంలో గురజాడది సంపూర్ణమైన ప్రగతిశీల దృక్పథం. తోక చుక్క అరిష్టదాయకమనే మూఢ విశ్వాసాన్ని ఖండించి —

"దూరబంధువు యితడు భూమికి
దారి బోవుచు చూడవచ్చెను
తెగుల కిరవని కతల నన్నుచు
దిగులుచెందు టదేటి కార్యము ?
తలతు నే నిది సంఘసంస్కర
ణ ప్రయాణ పతాకగాన్"

అనడంలో గురజాడ అభ్యుదయవైఖరి స్పష్టంగా గోచరిస్తుంది.

మంచి చెడ్డలు మనుజులందున
యెంచి చూడగ రెండె కులములు
మంచియన్నది మాలయైతే
మాలనే అగుదున్"

అని గురజాడ ఏనాడో గాంధీజీ హరిజనోద్యమాన్ని ప్రారంభించడానికి పూర్వమే ప్రవచించాడు.

"పుస్తకంబులలోని మాటలు
విస్తరించుచు ననుభవమ్ముల
కర్త్వమెరుగక ఉకము అగుచును వొట్టి శాస్త్రజ్ఞుల్"

అని నా నవికతకు నివాళు లెత్తాడు. ఒక్క కవితలోనేకాదు, తన సకల రచనలలో కూడా గురజాడ అవలంబించిన పద్ధతి ఇదే.

తెలుగుభాషకు ఖండాంతర విఖ్యాతి తీసుకురాగల సృజనా సామర్థ్యం ప్రదర్శించే మహాకవిగా గురజాడకి నా నమోవాకాలు అర్పిస్తున్నాను.

మద్రాసు,
12–7–58.

శ్రీరంగం శ్రీనివాసరావు.



కాసులు

మనలకీ పోరాట మిప్పుడు
దేనిగూరిచి కలిగె చెపుమా,
మరచితిని; .... నవ్వేద వదేలను ?
యేమికారణమైన పోనీ;

వినుము;....ధనములు రెండుతెరగులు;
ఒకటి మట్టిని పుట్టినది; వే
రొకటి హృత్కమలంపు సౌరభ
మదియు నిది యొక్కెడను కలుగుట
యరుదు; సతులకు వేఁతగినది.

యెద్దియో ?

మనసులో నీకుండు

ధనమన నొండుకలదే పసిడి
గాకని. ప్రాజ్ఞులకై కనికట్టు
కనకము; చపలచిత్తుల కన్ను
చెదరుట చిత్రమా ! తీవలకు

తలిరుల తెరంగున, కాంచనము
సింగారమందురు లలనలకు;
కానిమ్ము; గాని, కమ్మనితావి
గ్రమ్మెడి పుష్పనిచయము ప్రేమ
కా ? అదిలేక మంకెన కెంపు.

కాంతల యందము

ప్రేమ కొరుకుచు
తిందురా! యెట్టిదది? నా వలను
కలదో, లేదో; యను నొకవింత
చూపును చూచెదవు—
బంగరు

మిసిమి మేనికి పసపు నలదితి;
కురుల నలరుల నూనె నించితి;
కాటుకను మెరుగిడితి చూడ్కికి;
విడెము వింతహొరంగు గూర్చెను

వా తెరకు; పలువరుస వెన్నెల
లలమె; దాన దానను, మురువు
పెనగొనె నేర్చి మెరసితి రూపు;
ప్రేమ పెంచక పెరుగునే?

ప్రేమ—

పెన్నిధిగాని, యింటను నేర్ప
రీ కళ, ఒజ్జ లెవ్వరు లేరు.

శాస్త్రము లిందుగూరిచి తాల్చె
మౌనము – నేను నేర్చితిభాగ్య
వశమున, కవుల కృపగని, హృదయ
మెల్లను నించినాడను ప్రేమ

యను రతనాల — కొమ్మ !
తొడవులుగ నవి మేన దాల్చుట

యెటులనంటివో ? తాల్చితదె, నా
కంటచూడుము ! సతులసౌరను
కమలవనముకు పతుల ప్రేమయె
వేవెలుగు; ప్రేమకలుగక బ్రతుకు
చీకటి.

నా నేర్చుకొలదిది
(ప్రేమ విద్దెకు వోనమాలివి.)
యెదనునిల్పిన, మేలు చేకురు
"మరులు ప్రేమని మది దలంచకు;
మరులు మరలును వయసుతోడనె;
మాయ మర్మము లేని నేస్తము.

మగువలకు మగవారి కొక్కటె
బ్రతుకు సుకముకు రాజమార్గము.
ప్రేమనిచ్చిన ప్రేమవచ్చును
ప్రేమనిలిపిన, ప్రేమనిలుచును.
ఇంతియె —

కాసు వీసము నివ్వనొల్లక
కవితపన్నితి నని తలంపకు;
కాసు లివె; నీ కంఠసీమను

జేరి బంగరు వన్నెగాంచుత :
మగడు వేల్పన పాతమాటది;
ప్రాణమిత్రుడ నీకు నీ నెనరు
కలుగక యున్న, పేదను; కలిగినను
నా పదవి వేల్పులరేని కెక్కడ

లవణరాజు కల

నిండుకొలువున లవణుడను రా
జుండె, జాలికు డొకడు దరిజని.
"దండినృప! ఒక గండుగారడి
కలదు కను" మనియెన్

అల్లపించ్ఛము నెత్తినంత నె
వెల్లగుఱ్ఱం బొకటి యంచల
పల్లటి ల్లన నొడయు నుల్లము,
కొల్లగొనివచ్చెన్

వచ్చి నిలిచిన వారువంబును
యచ్చెరువు పైకొన్న చూపున
మచ్చపేరలు గనక చూపెడి
నృపుని కత డనియెన్:

"ఉత్తమాశ్వంబిది నరేశ్వర!
చిత్రగతులను సత్వజవముల
చిత్త మలరించేని జను మిక
మనసుగలచోట్లన్."

చూపుదక్కగ చేష్టలుడిగెను
చూపరులు వెరగంద నృపునకు;
యేపు చెడి, ఒక కొంతతడవున
కెరిగి, నలుగడలన్ –

కలయజూసెను కల్లనిజములు
కలకజెందిన మనసులోపల
మెల్లమెల్లన పూర్వజ్ఞానం
బల్లుకొని పొడమన్

"యేడి జాలకు దేది యశ్వం
బేడు లెన్నో గడిచె" ననె నృప
దేడునిమిషము లేవి ప్రభుడా !"
యనిరి తనభృత్యుల్.

కలదు లేదను రెండుభ్రాంతుల
కలయగూర్చుకు బుద్ధిబలమున
కాలమహిమకు వెరగుజెందుచు
లవణు డిట్లనియెన్

"ఏడునిమిషము లేడు లాయెనొ ?
యేడునిమిషము లందు యిమిడెనొ
యేడు లెన్నో ? యింతలంతలు
చింత చేయునొకో !"

యెక్కెనట పొకమాయగుఱ్ఱం
బొక్క నరపతి మనసు నిలవక;
యెక్కినంతనె పరవశంబై
యొగసె నది యెటకో !

కన్ను మిన్నును కనని జవమున
కాననంబులు గడిచి యెన్నో.
యెన్న జీవం బొక్క_టేనియు
లేనిమరుభూమిన్

మట్టి చనె సంసృతిని జీవం
బట్టు; యిరులును మరులు వేళకు
తుట్టతుద కొక గున్నయడవిని
బట్టి గమనంబున్

మందగించిన మానవేంద్రుం
డందుకొనె నొకకొమ్మనల్లుకు
క్రిందు వ్రేలెడితీవ; గుఱ్ఱము
ముందువలె పరచెన్

అడుగు పుడమిని తగిలినంతనె,
బడలియుంటను నిదురపాలై
ఒడలు తెలియక వ్రాలి నరపతి
చాగె మృతునట్లన్

పిదప జన్మాంతరము తెరగున
నిదురజారిన వేళ, కన్నుల
యెదుట వెలసెను వింతలోకము
సంజ కెంజాయన్

వెలుగునీడలు కనుల కింపై
మెలగి చెలగెడినాకసంబున
వ్రేలు మబ్బుల యంచు లంటను
రగిలె రత్నరుచుల్

పాఁడె పక్షులు పోఁజు పోఁజులు;
జీరె కోయిల లొకటి నొకటిని;
మూతి గూడుల దాసలాడెను
పిట్ట లెల్లెడలన్!

గగనరాజ్యము గ్రమ్మ వేడుక
మగటిమిని తన కళలు గూర్చుచు,
పగలు వెన్నున దన్ని సోముడు
పైనమై వెడలెన్.

తాటివనములు తూర్పుకొండను
దొడుగులెత్తెను; చామరంబులు
నిడిపె జీలుగు లుడుగణంబులు
దవ్వులను నిలిచెన్.

చల్లగాలులు సాగి యలలుగ
జల్లుజల్లున రాల్చె పూవుల;
ఉల్లసిలెను; ఆకతొక్కటె
బడబవలె నడరెన్.

అంతచెవులకు దవ్వుదవ్వుల
వింతగానం బొకటి సోకెను;
సోకినంతనె పూర్వవాసన
పిలిచినట్లాయెన్.

మరిచె నాకలి; మరలె నిదురలు;
పరవశుండై నృపతి, గానము
దరియ, గాంచెను శ్యామలాంగిని
నొక్క జవ్వనినిన్.

అర మొగిడ్చిన కన్నుగవతో,
చెదరి యాడెడి ముంగురులతో,
బెదురు యెరగని బింకమొప్పిన
బెడగు నడకలతో;

కూటికడవను బుజముపై నిడు
వాట మది యొక మురువు గులకగ
పాటపాడెను, పాటలాధరి
చెట్లు చామలకై:

పాటపాడెను, చెట్లుచామలు
కోటిచెవులను గ్రోలి యలరగ;
తోటివనమున నాగి చంద్రుడు
తాను చెవియొగ్గన్

ఎవనిగూరిచి పాటపాడెనో ?
యెవనినామము ధన్యమాయెనో ?
లవణుడను మాటొకటి నాచెవి
తాకినట్లయ్యెన్.

ii

మంచివలె నిది మాయమగునని
యెంచి, యించుక సంశయించక
కించలన్నియు తొలగి వెంబడి
వేడి యిట్లంటిన్.

"వినుము కిన్నరి ! నీకు దైవం
బన్ని శుభములు గూర్చుగావుత !
నిన్న నుండియు నన్న మెరుగని
యాక లోకవంకన్.

అంతకన్నను అధికతర మొక
వింతయాకలి మనసు గ్రాచెను:
యింత అంతని చెప్పనేరక
యిట్లు వెంబడితిన్."

అనగ కన్నియ, తిరిగి మెల్లన
నన్ను కన్నులు విచ్చిచూచెను;
పూర్ణబ్రహ్మాండాధిరాజ్యము
పూనినట్లయ్యెన్

చూసి, కన్నులు డించి, మది తల
పోసి, మిన్నక తోవసాగెను;
బాసె బింకము బెడగునడకల,
ముగిసె గానంబున్.

పండువెన్నెల కుముదవనిపై
నిండుగమ్మిన నీడ కైవడి
నిండె మోమున చింత యొక్కటి;
మరల నే నంటిన్,

"అన్నమిడు టాకొన్న వారల
కెన్న సుకృతతమం బటంచును
మున్ను పెద్దలు బల్కిరది నీ
వెరుగకుండుదువే ?

భృత్యునైతిని నీదుమూర్తికె
భృత్యునౌదును నీకు సుందరి !
మృత్యుముఖమున నున్న భటునకు
నన్ను మీవలదో ?

చన్న బ్రతుకుల కొలిచి కుడిచిన
తెన్ను మనసుకు కొంతతోచెడి;
నిన్న యన్నదె నేడు రేపులు
అన్యు నెట్లగుదున్ ?

మౌనమూనిన, మరలగలనని
మది దలంపకు" మంటి; కన్నియ,
గమనమించుక మందగించి
శిరంబు వంచి యనెన్,

వన్నెమీరిన మేనిపసతో
కన్ను మణగెడి రత్నరుచితో
"నన్ను తెలియక నాసచేసెద
వయ్యొ ! మాలితనేన్,

అయ్యకోసము కూడుకొందును !
ఇయ్యలేనను మాట, హృదయము
వ్రయ్యచేసెడు; నాదుభాగ్యము
కెవరి నే మందున్"

iii

అన్నపలుకు విసంపుథల్లము
కన్నవాడయి మనసుదూ సెను;
కన్నెకన్నుల నీరు గమ్మట
కాంచి ఖిన్నుడనై,

కొన్ని నిముషము లెన్నియెన్నో
కన్న విన్నవి ధర్మముల నే
నెన్నుకొని, వౌకపరమధర్మము
నపుడుగనుగొంటిన్,

మలినవృత్తులు మాలవారని
కులము వేర్చిన బలియు రాక దే
శమున కొందరి వెలికిదోసిరి
మలినమే, మాల.

కులము లేదట వాక్కు వేటున
పసరముల హింసించువారికి;
కులము కలదట నరుల వ్రేచెడి
క్రూరకర్మలకున్.

మలినదేహుల మాల లనుచును
మలినచిత్తుల కధికకులముల
నెలవొసంగిన వర్ణధర్మము
ధర్మ ధర్మంబే.

అనెడు నిశ్చయ మాత్మదోపగ
"వినుము కన్నియ !" యంటి యెదురై
"జనులు తెలియక పలుకు మాటకు
జనదు వగవంగన్.

మంచిచెడ్డలు మనుజులందున,
యెంచిచూడగ, రెండెకులములు
మంచియన్నది, మాలయైతే,
మాలనే, అగుదున్ !

తెలివి యొలికెడి తేటకన్నులు
మురువు గులికెడి ముద్దుమోమును
వేల్పు వేడియలైన నేరని
గానమాధురియున్.

చిత్తరుపులందైన గనని ప
విత్రరూపపు సౌష్టవంబును,
ఉత్తమోత్తమజాతిలక్షణ
యుక్తి సంపదయున్.

మాల యనువారున్న. వారల
మందబుద్ధికి వగవవలె; తన
యందు లేనికొరంత కలదని
వగవగానేలా ?

నమ్ము నే ననుమాట తెరవర! భ
యమ్ము వాయుము; కూటినిడి చే
కొమ్ము నా హృదయంపు రాజ్యము
నిస్సపత్నముగాన్!"

వినియె ప్రీడావిస్మయంబులు
ఆననంబున పొడమిపొరగ
కనుల నెత్తుచు డించుచును నను
కాంత యిటు బలికెన్.

"తండ్రికోసము తెచ్చు కూటిని
తిండికై యొరు కెట్టులిత్తును ?
పెండ్లియాడిన పెనిమిటొకనికి
పెట్ట ధర్మంబా !

తడవు ఆయెను తల్లడిల్లుచు
తండ్రి నాకై యెదురుచూసును"
అనుచు నన్ను తొలంగుభావము
అతివ అగుపరచన్.

కరముబట్టి యురంబు నురమున
జేర్చి ముద్దిడి కురులు దువ్వితి;
తాళవనమును వెడలి చంద్రుడు
పకప్రైనను నవ్వెన్.

"ఆడబోయిన తీర్థ మెదురై
వేడబోయిన వరము వచ్చెను;
పెండ్లి యాడెద చంద్రు సాక్షిగ
పెట్టు కూడం" టిన్.

మున్ను వేల్పులు వెన్నచేతను
గొన్న యమృతము కన్న రుచులను
చెన్ను మీరెను కూడు. కన్నియ
చేత నిడినంతన్.

"వచ్చితివ యల్లుండ ! నీకై
వేచియుంటిని యింతకాలను:
యిచ్చితిని, చేకొమ్మ కూతును
ప్రాణమది నాకున్.

వచ్చితిమి యెటనుండో, అటబో
నిచ్చ మెండై యుండు మనమున:
పసిడిగొలుసులు. బిడ్డ నాకై
పట్టి నన్నుంచెన్ !

ఇహములోపలి మంచియంతయు
యిమిడియున్నది దీని ఆత్మను:
ముక్తికాంతై తుదకు నీకిది
ముందుగతి చూపున్.

కరపినాడను పరము మరవక
యిహమునందున మనెడుమర్మము:
కోటితపముల పుణ్యఫలమిది
కొమ్మ నీ కిస్తిన్ !

మాలనైనను మలినవృత్తులు
మానుకుంటిని గురువుదయచే:
పొలములోపల పశుల మేపుచు
పొట్ట పోషింతున్.

మలినవృత్తులు మాన్పి, మాలల
వలనఁ తెచ్చితి యీ వనాంతము;
పల్లె కలదిట; ప్రాజ్ఞులందలి
ప్రజలు మావారల్ !

పాడిపంటలు గలవు, తామర
తంపరలు మా పశులమందలు;
జంతుహింసను చేయనొల్లము
భూతదయ మతము !

కాని మనుజుని బుద్ధిలోపల
కలవు, తన మేఁ జారుల కీడును
తలచువృత్తులు కానబోయిన
కలచు నెవ్వారిన్.

మాన్పగలిగితి కత్తికోతలు;
మాన్పవశమే, మాటకోతలు ?
కత్తి చంపును, మాటవాతలు
మాప వేనాడున్ !

నాటునను గలయట్టి యిడుములు
కాటియందును కలవు; ఓరిమి
యేటికైనను మందు; కలిగిన
కలుగు సౌఖ్యంబుల్.

యేలుకొను దొందొరుల; సిరులకు
మిట్టిపడకుడు; కీడుమూడిన
నాడు కుంగకు దొరుల మేలుకు
పాటుపడు డెపుడున్ !"

అనుచు పలికెను వేదవాక్కులు
మమ్మ చేతులుబట్టి కన్నియ
తండ్రి, తొల్లిటిఋషి యితం డని
తోచ చిత్తమునన్ !

పండు గెడ్డము; నిండుకన్నుల
నిండ శాంతరసంబు; పలుకుల
కడలి గాంభీర్యంబు, యొడలివి
దివ్యతేజంబున్;

కలిగి కూచునె రాజఋషివలె
రావికిందను రచ్చశిలపై
కొమ్మలను జొరి చంద్రకాంతులు
మేన చెదరంగన్.

అంతనుండియు కొన్నిపంటలు
కాంతతో నట స్వర్గ సౌఖ్యము
లొంది మంటిని; చక్రవర్తుల
కొమరులను కంటిన్.

చిత్త మా కొమరులను :తగులుట
క్రొత్త శృంఖల యంచు మాను ని
వృత్తిమార్గముపట్టి, దేహము
వాసె యోగమునన్.

పల్లెలోపల బొమ్మలాటలు
అల్లుకొనె, ఆ నాటనుండియు
యెల్లవారలు పెద్దలగుటకు
యెంచి చూడంగన్.

సన్నగిల్లెను సాగు. పొలమున
వున్నదెల్లను తిన్న పిమ్మట
తినిరి పెంచిన పశుల చంపుకు,
అవియు కడితేరన్,

చెల్లచెదురై పరచి రందరు
యెల్లదిశలను; పరచుముందర
కొల్లకొని రేనున్న పొలమును
పండి మే ముండన్.

తెల్లవారిననుండి మేమును
పిల్లలము పడ్డట్టిపాటులు
ఘుల్లుమనియెడు నోడలు తలచిన
చాల, చెప్పంగన్.

4)

అడవియందలి కాయకసురులు
కుడువనేరక బడలె బిడ్డలు;
అడవి ద్రిమ్మరి కడకు ప్రాణము
చేరి నే నుంటిన్.

ప్రాణసఖి నను పిలిచి యప్పుడు
పలికె స్మితముఖియై "వినుం డిక
చేయుకార్యములేదు; చెల్లెను;
ముందు గనవలయున్.

కడకుజేరితి మీ భవంబున
తడవులేదిక; మనసు తిప్పుకు
గడగడవలె రాబోవుభవమున
జ్ఞానసంపదకై.

కష్టసుఖములతీరులెన్న న
దృష్టములు — మనసత్యవర్తన
కాచుగావుత, కౌవగలిగిన
కన్న పసివాండ్రన్.

చింతయుడుగుడు — చితిని జొత్తము
యింతకన్నను భాగ్య మున్నదె!
అంతమున మతి యెట్టులుండునొ
అట్టిగతి గల్గున్.

కలుగు భవములుకూడ నీతో
కలసి గడపుచు ముక్తి జెందెద
కలదె నీ ప్రణయాతిరేకము
 కన్న సద్గతియున్ ?"

అనుచు, చింతలుపాసి, కైకై
జేరి జొచ్చితి మపుడు చితి.

V

పలికె నిట్టుల పటువిషాద స
మాకులేక్షణు డగుచు లవణుడు;
"కలగ వల దిది మాయ సర్వం"
 బనిరి శాస్త్రజ్ఞుల్.

లవణు డనియెను గొంతులు ముడివడ,
"కలగవలదట ! కల్ల యిదియట !
కలిగినది లేదన్న యంతనె
 తొలగునట వేదన్ !

పుస్తకంబులలోని మాటలు
విస్తరించుచు, ననుభవమ్ముల
తత్త్వమెరుగక, శుకము లగుదురు
 పొట్టిశాస్త్రజ్ఞుల్ !

యెప్పటికి అనుభూతమెద్దియొ
అప్పటికి యది నిక్కువంబే;
యెప్పుడో లోకంబు కల్లగు
ననుట యిపుడెట్లో ?

చిత్తమందున కీలితములై
నిత్యఖేదము నిచ్చు తలపుల
నెత్తిపై చను — లేరె, హా ! యిది
చెప్పగల ప్రాజ్ఞుల్ ?

యెక్కడిది, ఆ మాయదేశం
బెక్కడుందురు నాదుబిడ్డలు ?
ఒక్కరైనను జూపలేరే
నాదు ప్రాణసఖిన్ ?"

నృపుడు యిట్లని శోకభార
మ్మాపుకొన శక్యమ్ముగా కిరు
కేల కన్నులుమూసి, చింతా
మగ్నుడై యుండెన్.

అంత దుర్గద్వారసీమను
వింత కలకల వినగనయ్యెను;
చెంత ద్వారకు డేగి నృపునకు
తెల్పె "ఒక మునియున్

వారువముపై నొక్క కన్నియ
వచ్చి నిలిచిరి ద్వారసీమను”.
“చెచ్చెరను తెమ్మ”ని యా నరపతి
నోటిమాటుండఁ.

జొచ్చె నాస్థానాంగణం బప్
డప్సరాకృతి యొక్క కన్నియ;
అచ్ఛవర్ణపు టశ్వరాజం
బొక్క తాపసుడున్.

పలికె తాపసు “డతుల సౌఖ్యం
బధిప! నీకౌఁ గాక! యవనుడు,
సింధుదేశాధిపుడు, పితృసఖు
డంపె కానుకగా.

తనదు గాదిలిపట్టి, యీ యమ
వినయ విద్యాసద్గుణాన్విత;
కోరె నీ నెయ్యంబు; నీ గుణ
సంపదకు నలరెన్.

పంపె నీ కీ యశ్వరాజం
బెందులే దిద్దాని కీడ” నె;
చెవిని మాటలు సోకిసోకక
లవణు డక్కన్నెం

జూచె, స్మయహర్షాతి రేకము
లాత్మ పెనగొన; డాసి, చేకొని
"వచ్చితివ నా ప్రాణసఖి!" యని
గద్దియను జేర్చెన్.

కన్యక

తగటు బంగరు చీరెకట్టి
కురుల పువ్వుల సరులుజుట్టి
నుదుట కుంకుమబొట్టుపెట్టి
సొంపు పెంపారన్;

తొగల కాంతులు కనులు పరపగ
మించు తళుకులు నగలు నెరపగ
నడక లంచకు నడలు కరపగ
కన్నె పరతెంచెన్
రాజవీధిని.

పసిడి కడవల పాలు పెరుగులు
పళ్ళెరమ్ముల పళ్ళు పువ్వులు
మోము లందున మొలక నవ్వులు
చెలగి చెలికత్తెల్
వెంటనడిచిరి.

అంతపట్టపురాజు యెదురై
కన్నె సొగసుకు కన్ను చెదరై
పురుని వాడికి గుండె బెదరై
యిల్లు తలపోసెన్.

"ఔరః చుక్కలనడుమ చందురు
నట్లు వెలిగెడు కన్నె ముందర.
వన్నె కాంచిన నగరిసుందరు
లందరొక లెక్కా ?

పట్టవలెరా దీని బలిమిని
కొట్టవలెరా మరునిరాజ్యం
కట్టవలెరా గండపెండెం
రసికమండలిలో."

నాలనడుమను నట్టివీధిని
దుష్టమంత్రులు తాను పెండెం
కట్టి కన్నెను చుట్టి నరపతి
పట్టమంకించెన్.

పుట్టి వచ్చిన దైవగతి కిక
దైవమే గతియని తలంచుక
దిట్టతనమును బూని కన్నియ
నెట్ట నిటు పలికెన్.

"ముట్టబోకుడు దేవకార్యం
తీర్చివచ్చెద. నీవు పట్టం
యేలురాజువు. నెట్టికూతుర.
నెటకు పోనేర్తున్."

చుట్టములు తన చుట్టు నిలవగ
భృత్యవర్గం కాచి కొలవగ
సెట్టి కరములు మోడ్చి రాజుకు
ఇట్లు వినిపించెన్.

"పట్టమేలే రాజ! బలిమిని
పట్టవలెనా? నీదుసామ్మ్త్రె
కాద కన్నియ? నీవుకోరుట
కన్య మరికలదా
వైశ్యజాతికె వన్నె?

గాని మన్ననజేసి మమ్ముల
బంధువర్గం, కులంపెద్దల,
ధర్మమన్నది అరసి కొంచెం
దారి కనబడితే,

అగ్నిసాక్షిగ కన్నె గైకొని
ఆదరించుము మమ్ము, కానుక
లందుకొమ్మెం తెంత యిలసిన,
మనుచు మా జాతిన్."

నవ్వి హేళన నవ్వు, నరపతి
పల్కె "నోహో! ధర్మమార్గం
పట్టమేలే రాచబిడ్డకు
సెట్టి కరపడమా!

రాజు తలచిందేను ధర్మం.
రాజు చెప్పిందెల్ల శాస్త్రం.
రాజులకు పేరైన పద్ధతి
కాద, గాంధర్వం ?

తడవుచెయ్యక తల్లడిల్లక
నేడు రేపని గడువుపెట్టక.
నెమ్మిగోరితి వేని. కన్నియ
నిమ్మ !
లేకుంటే. పొమ్మ !

దేగ. పిట్టను పట్టి విడుచున ?
కన్నె. యింటికి మరలినడుచున.
తెమ్మకానుక లిమ్మ. నీ విటు
వచ్చి నంచాకన్.

కదల" నంతట నెట్టి పలికెను.
"దేవకార్యం ముందు. ఆవల
రాచకార్యం కాద రాజా !
శలవు నీవిస్తే

యింటిదైవం వీరభద్రుడి
దేవళానికి పోయి యిప్పుడె
పళ్ళెరం సాగించి వత్తును
పైని తమ చిత్తం !"

“మంచిదే. మరినడువు. మేమును
తోడవత్తుము. దేవళంలో
అగ్నిసాక్షిగ కన్యకను మే
మంటుకొనగలము.”

11

నాడు గుడిలో మండె గుండం
మంట మింటిని ముట్టిపోవగ
కన్న నరపతి గుండె దిగులై
పట్టు విడజొచ్చెన్.

భక్తి పరవశమైన మనసున
దుర్గ నప్పుడు కొలిచి, కన్యక,
ముక్తి వేడుచు పూచ్చ నగలను
శక్తి కర్పించెన్.

దుర్గకాలను మ్రొక్కి పిమ్మట
రక్తగంధం రక్తమాల్యం
దాల్చి గుండం చుట్టునిలిచిన
జనుల కెట్లనియెన్ !

“అన్నలారా తండ్రులారా
ఆలకించం డొక్క విన్నప

మాలుబిడ్డల కాచుకొనుటకు
ఆశలే దొక్కొ
కులము లోపల ?

పట్టమేలే రాజు అయితే
రాజునేలే దైవముండడొ ?
పరువు నిలపను పౌరుషము మీ
కేల కలుగదొక్కో ?

విద్య నేర్పిన వాడు విప్రుడు
వీర్యముండిన వాడు క్షత్రియు
డన్న పెద్దల ధర్మపద్ధతి
మరచి, పదవులకై

ఆశచేయక, కాసువీసం
కలిగివుంటే చాలు ననుకొని,
వీర్య మెరగక, విద్యనేర్పక,
బుద్ధిమాలినచో

కలగవా యిక్కట్లు ? మేల్కొని,
బుద్ధిబలమును బాహుబలమును
పెంచి దైవమునందు భారం
వుంచి, రాజులలో

రాజులై మనుడయ్యా !" ఇట్లని
కన్య నరపతి కప్పు డెదురై

నాలుగడుగులు నడచి ముందుకు
పలికె నీ రీతిన్.

"పట్టపగలే, నట్టివీధిని
పట్టుబోరే జారచోరులు
పట్టుదలచితి వింక నీకాక
పట్టమేలే రాజువటు:

కండకావర మెక్కి నీవి
దుండగము తలపెట్టినందుకు
వుండదా పోక దైవమంటూ,
వుండి వూర్కొనునా ?

కులంపెద్దలు కూడి రదుగో !
అగ్నిసాక్షికి అగ్ని అదుగో !
కన్నుకోరిన కన్నె యిదుగో !
జాల మేలా కోకై !

పట్టమేలే రాజువైతే
పట్టునన్నిపు" డనుచు కన్యక
చుట్టిముట్టిన మంటలోనికి
మట్టి తా జనియెన్.

పట్టమేలే రాజుగర్వం
మట్టిగలసెను, కోటపేటలు

కూలి, నక్కల కాటపట్టై
అమరె.

ఎక్కడైతే కన్య. మానం
కాపుకాసుటకు మంటగలిసెనో,
అక్కడొక్కటి లేచె సౌధము
ఆకసము పొడుగై.

పట్టణమేలే రాజుపోయెను.
మట్టికలసెను కోటపేటలు,
పదం పద్యం పట్టి నిలిచెను
కీర్తులపకీర్తుల్.

డామన్ పితియస్

వన్నె కెక్కిరి దమను పితియసు
లన్న యవనులు ముజ్జగంబుల
మున్ను: వారల స్నేహసంపద
నెన్న సుకృతంబౌ.

ఒక్కనా డా సీమ జనపతి
యక్కజంబగు కోపభరమున
"ద్రక్కలించుము దమనుశిరము"ని
పలికె తలవరితోన్.

చెక్కుచెదరక నిలిచి దమనుడు
"నిక్కమే కద చావు నరునకు
యెప్పుడెప్పుడు, మెటులగూడిన
నొక్కటే కాదా ?

ప్రొందుటన్నది బొందిమార్పుట
ముందు భవమున కలుగు విభవము
నందజేయుటకాదె, యేలిక,
దండ మిను మిషను ?

కాని యింటికి పోయి యొకతరి
కనులజూచెద నాలుబిడ్డల:

పనులు తీర్చుకు మరలి వత్తును
యానతిం" డనియెన్.

వింతపలుకుకు విస్మితుండై
కొంత కరకరి తీరి నరపతి,
"యింత యిట్టుల మిడునెవిడ్చె"ను
చింత చిగురెత్తన్.

అనియె నరపతి "యెటుల కాని
మ్మవని కొంచెము విపుల మందురు;
తనువు దాచను తగిన చోటులు
కలవు యెటు జనినన్.

మించు చతురత మాట విరుపున
యెంచినాడవు చెడ్డ మంచని;
పంచప్రాణములందు ప్రేముడి
పరచునే ? చెపుమా ?

అలుబిడ్డల చూతునంటివి;
ఆలకించిన వారి శోకము
తొలగు విద్యలు తొలగు ధైర్యము,
తొలగు నీతైనన్.

కాన నీకై తనువు నోడెడి
వాని నొక్కని జూపి చనవగు;

మానవేశుని యాన తప్పిన
                    మాయదే జగము ?”

లేచి పలికెను పితియసప్పుతు:
“రాచసింగమ ! ఒడలి కొండలిదె !
వేచియుంటిని బ్రతుకు ఫలమునకు,
                    దొరికె నీ సాటన్.”

“ఐన, చనుమ”నె నవనిపతి; దా
మనుడు కొంచెము తలచి, యిట్లను
“పనుపు, ఘటులను పనికె, నిప్పుడె
                    పోప నే నొల్లన్.

వొకటి తలచును నరుడు మది, వే
రొకటి తలచును బ్రహ్మ; వినమె ?
పోక రాకల నడుమ నడ్డము
                    నెవ్వి తలపడునో ?”

“పోమ్ము: పోమ్ము”నె రేడు, “పొమ్మట:
రమ్ము, యీనెల నిండు సంతకు;
లెమ్ము, చాలదె యుదను పో, రా,
                    నష్టి గడ్డైనన్”

కడలి నడుమను కలదు సేమా
సనెడి ద్వీపము కవుల పుట్టిలు;
వాడి లేదట యినుని వేడికి
సీతు వలికైనన్.

ఋతువు కొక్కొక్క వింతరూపం
బతుల శోభా భాజనంబై
మతుల కొల్లలనాడు స్వర్గం
బేమొ యాసీమ!

అందు నొందొక కొండకోనను
సుందరంబగు భవనరాజము;
విందు కనులకు కడలి యెదురై
లీల లోలాడన్.

పక్షముల నారింజ, ఆలివు
వృక్షషండము లుప్పతిల్లును;
ద్రాక్షపందిరు లింటిపంటలు
సొంపు పచరింపన్.

నవ్వులను నెసదులకు నిత్తై
నివ్వటిల్లెను భవనరాజము;

పువ్వులెత్తుచు గాననిలచిన
మెండు మనమైనన్.

తడియ చందురు డద్ది పోకెను;
చదల విడబడి, యిరులు ప్రాకెను;
అదను కాంచిన రిక్కమూకలు
అంతటను ప్రబలెన్.

చారుతరముగ పసిడి పమిదలి
బారుతీరి వెలింగె జ్యోతులు;
వారియంత్రము తళుకు ముత్తెపు
సరులు విరజిమ్మెన్.

అలరు జిగురుల తోరణావళి
యలమి చుట్టెను జిలుగు కంబము
లుల్లసమలరగ నాటపాటలు
వమ్మెయి నెలగెన్.

ఘుమ్ము. ఘుమ్మని కమ్మతావులు
గ్రమ్మె ధూపము లాసవమ్ముల
దుమ్ము రేగెను నాటిపండువ
నిండు వేడుకతోన్.

చుట్టములు మిత్రులును, భ్రాతలు
చుట్టు మూగుచు దమను నడిగిరి

"యెట్టివింతలు తెచ్చినాడవు ?
కలదు పెక్కు గనన్ ?"

పలికె దాసను "యిలను ద్రిమ్మరి
పలుతెరంగుల జనుల గాంచితి:
తెలియనేర్చితి మర్మ మెల్లను
వారి విద్యలతో.

యెరుగరాదని తొల్లివిబుధులు
మరుగుపరచిన మంతనంబుల
తిరుగుడులు మరలించి, తీసితి
రాళ రప్పలలోన్.

వింత నొక్కొక దానికని, మను
యింత కెక్కుడు లేదనుంటిని;
వింతలన్నిటి వమ్ముజేసెడి
వింత వినుడింకన్.

'ఒకటె' ఆయెను రెండు మూడులు
'ఒకటె' ఆయెను కోటిసంఖ్యలు;
పెక్కులొకటిగ జూచువాడే
ప్రాజ్ఞుడన వినమే ?

నేను తానను భేద బుద్ధిని
లేని కాగ్రహ మెదవె దాసను

కానివాడని తలచి ప్రాణము
గోలుపోమ్మనియెన్.

ఒక్క వింతిది — పిరికి దామను
వొకటి వొకటికి సమముకద ? పే
రొకడు నా కయి ప్రాణమిచ్చిన
చాలదా యనియెన్ ?

వింత రెంతవదిద్ది — నృపుడును
చింతవాపుచు వల్లెయనియె, న
నంతరము నే నిటకు వచ్చితి
వింత కనఁగోరి.

కాన, మీరల నెవ్వడిప్పుడు
తాను, నేనను బుద్ధితలపక
తనువు నాకై విడుచువాడ" న
పలుక డొకడైనన్.

చింతవంతలు చిత్రితములై
అంతకానగ నయ్యె మోముల
"వింత యిదె" యని పలికె దామను
వికసితాననుడై.

ఆటపాటలు అణగెనంతట
మాటుమణిగెను భవనరాజము;

చాటుమాటున పారజొచ్చిరి
సఖులు చుట్టములున్.

"కల్ల జెప్పితి !" నని మె డాపను
"మెల్ల రెప్పటి యట్ల సలరుం
డుల్లముల !" వారపుడు "కాను మిపె
ప్రాణములు" నన్నన్.

పంజరమ్ముల నున్న పిట్టలు
మంజులారణ్యములు మరచెను
శింజితములౌ కాలి గొలుసులు
శిక్షయని మరచెన్.

"దారిపోయే వారి కొక్కటి
•కారవాసర కల్పనాయెను
దారికాదది దరి యటంచును
తలచు టొక వింత ?"

అనుచు, డామను డాసవమ్ముల
నాని పాడ దొడంగి మించెను;
కాని పండువునందు కొండొక
కలక కననయ్యెన్.

• కారవాసర = Caravansary : చనుప

ఎల్లి పున్న మనంగ పితియసు
యిల్లునందొక విందు మిత్రుల
కెల్ల నాయెను; పితియసప్పుడు
పల్కె నీ పగిదిన్.

"తెలియువాడన; నొక్కఁడే భువి;
తెలుపువాడన నొక్కఁడే భువి;
పలు తెరంగుల సద్గుణాళికి
పట్టు వక్కఁడే!

కనియు, నేర్చుట, వానికడనే;
వినియు, నేర్చుట, వానివలనే;
అనగవలెనా, అతడు దాసను
డన్న మాటొకటి?

లోకమం దభిమాన ముంచియొ
నాకు యశ మొనఁగూర్చ నెంచియొ,
నాకపతి, నామిత్రు డాసను
రాక నడ్డ డొకో;

బ్రతికి, చచ్చియు, ప్రజల కెవ్వడు
ప్రీతిగూర్చునొ, వాడె ధన్యుడు;
బ్రతికి, డాసును ప్రజల మేలుకు
చచ్చి నే నొకడన్.

మ్రుందుటన్నది బొంది మార్పుట:
ముందు భవమున కల్గు విభవము
నంద, ప్రాజ్ఞుడు వగవ జెల్లునె
చెప్పుడీ" యనియెన్.

"చదివి చెడితివి చాలు"నె నొక
"ఒదవె యశము"ని బలికె నొక్కం
"శదనునకు శామనుడు రాడా?"
యనియె నొక్కరుడున్.

అంత పితియసు కాంత పలికెను
కొంత గద్గదికంబు తోపగ,
"ఇంత వరకును ధైర్యమూనితి
మాట నమ్మికచే.

వచ్చువాడయితేను శమనుడు
వచ్చు నింతకె, చావు కోసము
యిచ్చగించుచు తానె వచ్చునె
పిచ్చివాడైనన్.

వత్తునన్నను, వారివారలు
మొత్తమై తామడ్డు పడరే?
పొత్తులన్నవి సంపదలకే;
ఆపదల కగునే?

హాని నసుచే లింత ? పతి తన
ప్రాన సెంచక, బలగమెంచక
తనువు మిత్రుని కోడు టన్నది
తగవ ? ఇది చెప్పరా !

కష్టసుఖముల కలసి కుడుచుచు,
సౌఖ్య ప్రాణం బంధు మెంచుచు,
ఇష్టవర్తన మున్న వానను
బాయు వోక మహిమా ?

పెంచు, పిల్లాట నిక్కపాటను
కొంచు మెప్పుడైన నొకలని;
ఎందరో కలరవెదు వారలు
పేరు చనువారల్.

చదువువారికి వెర్రి భ్రాంతులు
మెదడుకెక్కిన పాయ వందురు;
అదును లేదే దేనికైనను ?
అంద రెరుగనిదే ?

పండగలదని కాయ కుడుతురె ?
తింపి యెల్లిడి సేడు తిందురె ?
అండమందున చిలుక కలదని
అరచి జీవెదరే ?

బతకవలసిన కాలముండగ
బతుక నొల్లమి కంతె పుట్టునె
బతుకు దునిమిన బతుకు భారము
పాపమే చెపుదా!

అది యటుండగ దమనుపై పగ
మది దలంచిన మానవేశుడు
బదులుగా గొనె పాప మెరుగని
ప్రాణి నేలనొకో ?

నరుని చావే కాంక్ష్య మేనియు
నరపతికి, నరు లెంచ రనుదిన
మరుగువారలు యముని పురమున
కంత తనియదొకో ?

తప్పు వొకయెడ దండ మొకయెడ
వొప్పె యని, నరపతికి దోచిన
నప్పగించెద నాదు ప్రాణము
దమను కన్నంతన్.

నీతి వెలువడి నిలిచె ముందట
వేడ్క మోమున వెల్లివిరియగ
"వీడె దమనుం" డంచు నందరు
విస్మయము చెందన్.

ఆ మహామతి; అంత వేరొక
యమిత విక్రమ మతని కెదురై
"దమన ! బతుకుము బతుకు" మనె.
"వేడ" నిరి పలుకు కటన్.

పలికె నరపతి "మిత్రభావము
నలుపు డిక నీ సఖుడు నీవును;
అలఘురాజ్యము ప్రేమసంపద
కలతియని దలతున్.

విద్యలంతటి మాయ మర్మము
దిద్ది చెప్పిం దబల యొక్కతె;
విద్యలెరుగని ప్రేమ భరమును
వింతగా చూపెన్.

వినగ తగినది వింటి నిచ్చట;
కనగ తగినది కాంచినాడను,
మనుజులిద్దరు మగువయొక్కతె
మాన్యు లీ జగతిన్."

పూర్ణమ్మ

మేలిమి బంగరు మెలతల్లారా!
కలువల కన్నుల కన్నెల్లారా!
తల్లులగన్నా పిల్లల్లారా!
విన్నారమ్మా యీ కథను.

ఆటలపాటల పేటికలారా!
కమ్మని మాటల కొమ్మల్లారా!
అమ్మలగన్నా అమ్మల్లారా!
వినరమ్మా మీ రీ కథను.

కొండల నడుమను కోనొకటున్నది;
కోనకి నడుమా కొలనొకటుంది;
కొలనిగట్టునా కోవెలలోపల
వెలసెను బంగరు దుర్గమ్మ.

పూజారింటను * పుట్టెను చిన్నది
పుత్తడి బొమ్మా పూర్ణమ్మా;
అన్నల తమ్ముల కనుగై దుర్గకు
పూజకు పువ్వులు కోసేది.

---

* పుట్టిన — అని పాఠాంతరం

[illegible]

మె[illegible] [illegible] వెలుగుల్లారా,
[illegible] ల్లారా,
[illegible] ల్లారా
[illegible]

[illegible]
[illegible] ల్లారా
[illegible] ల్లారా
[illegible]

[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]

[illegible]
[illegible]
[illegible]
[illegible]

[illegible]
[illegible]
[illegible]
[illegible]

ఏయే వేళల పూసే పువ్వుల
ఆయా వేళల అందించి
పండగ దుర్గను భక్తితో కొలిచెను
పుత్తడిబొమ్మా పూర్ణమ్మా.

ఏయే ఋతువుల పండే పళ్ళను
ఆయా ఋతువుల అందించి
పండగ దుర్గను భక్తితో కొలిచెను
పుత్తడిబొమ్మా పూర్ణమ్మ

పళ్ళను మీరిన తీపుల నడలను
పువ్వుల మీరిన పోడుములున్
అంగములందున అమరెను పూర్ణకు
సొగసులు మించెను నానాటన్.

కాసుకు లోనై తల్లీతండ్రీ
నెనరూ న్యాయం విడనాడి
పుత్తడిబొమ్మను పూర్ణమ్మను వొక
ముదుసలి మొగుడుకు ముడివేస్రి.

ఆమని రాగా దుర్గ కొలనులో
కలకల నవ్వెను తామరలు
ఆమని రాగా దుర్గవనములో
కిలకిల పలికెను కీరములు.

ముద్దునగవులూ మురిపెంబు మరి
పెనిమిటిగాంచిన నిమిషమున
జాపెను కన్నియ ముఖకమలమ్మును
కస్తూరి గ్రమ్మెను కన్నెడ.

ఆటల పాటల తోటి కన్నియలు
మొగుడు తాత ॥యని కేలించ,
ఆటల పాటల కలియక పూర్ణమ
దుర్గను చేరి దుఃఖించె.

కొన్నాళ్ళకు పతి కొనిపో వచ్చెను
పుత్తడిబొమ్మను పూర్ణమను;
చీరెలు సొమ్ములు చాలగ దెచ్చెను
పుత్తడిబొమ్మకు పూర్ణమకు

పసుపు రాసిరి బంగరు మేనికి
జలకములాడెను పూర్ణమ్మ;
వదినెలు పూర్ణకు పరి పరి విధముల,
నేర్పులు మెరసి కై చేసి.

---

* ముద్దునవ్వులూ మురిపెములూ మరి— అని వ్రాతప్రతి.

† పెనిమిటిఁజూచిన.

‡ అని

పెద్దల కప్పుడు మొక్కేను పూర్ణమ
తల్లీ తండ్రీ దీవించ్రీ:
దీవెన వింటూ పక్కున నవ్వేను
పుత్తడిబొమ్మా పూర్ణమ్మా!

చిన్నల నందర కౌగిట చేర్చుకు
కంటను బెట్టెను కన్నీరూ;
అన్నల తమ్ముల నప్పుడు పలికెను
పుత్తడిబొమ్మా పూర్ణమ్మ.

అన్నల్లారా తమ్ముల్లారా !
అమ్మను అయ్యను కానండీ !
బంగరు దుర్గను భక్తితో కొలవం
దక్కుల కమ్మా దుర్గమ్మ.

ఆ యా వేళల పూసే పువ్వుల
ఆ యా ఋతువుల పళ్ళన్నీ
భక్తిని గోపి * శక్తికి యివ్వం
* దక్కుల కమ్మా దుర్గమ్మ.

నలుగురు కూచుని నవ్వే వేళల
నా పే రొకతరి తలవండి;
మీ మీ కన్నబిడ్డల నొకతెకు
ప్రేమను నా పేరివ్వండి.”

* తెచ్చి

ఇల ఇల కన్నుల కప్పి పొలికేను
పుత్తడిబొమ్మకు పూర్ణమ్మకు
కన్నులు తుడుచుకు కలకల నవ్వేను
పుత్తడిబొమ్మా పూర్ణమ్మా.

వగచిరి వదినెలు, వగచిరి తమ్ములు
తల్లియు కంటను తడిపెట్టెన్
కాసుకులోనై అల్లుని తలచుకు•
ఆనందించెను అయ్యొకడె.

ఎప్పటియట్టుల సాయంత్రమ్మున
యేరిన పువ్వులు సరిగూర్చి
సంతోషమ్మున దుర్గను కొలువను
ఒంటిగ పోయెను పూర్ణమ్మ.

ఆవులు పెయ్యలు మందల జేరెను
పిట్టలు చెట్లను గుమిగూడెన్
మింటను చుక్కలు మెరయుచు పొడమెను
యింటికి పూర్ణమ రాదాయె.

చీకటిపించెను కొండల కోనల
మేతకు మెకములు మెసల జనెన్
దుర్గకు మెడలో హారము లమరెను
పూర్ణమ యింటికి రాదాయె.

• చూపుకు

కన్నుల కాంతులు కలవలచేరెను
మేలిమిజేరెను మేనిపసల్ :
హంసల జేరెను నడకల బెడగులు
దుర్గనుజేరెను పూర్ణమ్మ

మనిషి

మనిషి చేసిన రాయి రప్పకు
మహిమ కలదని సాగి మొక్కుతు
మనుషులంటే రాయి రప్పల

కన్న కనిష్టం !

గాను చూస్తా వేల వేలా ?
దేవ డెకడో దాగెనంటూ
కొండ కోనల వెతుకులాడే

వేలా?

కన్ను తెరిచిన కానబడదో ?
మనిషి మాత్రుడి యందులేడో ?
మెదిగి కోరిన కరిగియాడో

ముక్తి !

దేశభక్తి

దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా;
వొట్టిమాటలు కట్టిపెట్టోయి
గట్టి మేల్ తలపెట్టవోయి!

పాడిపంటలు పొంగిపొర్లే
దారిలో నువు పాటుపడవోయి;
తిండికలిగితె కండకలదోయి
కండ కలవాడేను మనిషోయి!

ఈసురోమని మనుషులుంటే
దేశమే గతి బాగుపడునోయి?
జల్దుకొని కళలెల్ల నేర్చుకు
దేశి సరుకులు నించవోయి!

అన్ని దేశాల్ క్రమ్మవలెనోయి
దేశి సరుకుల నమ్మవలెనోయి;
డబ్బు తేలేనట్టి నరులకు
కీర్తిసంపద లబ్బవోయి!

వెనక చూసిన కార్యమేమోయి?
మంచి గతమున కొంచెమేనోయి

దేశమును ప్రేమించుమన్నా!
మంచి అన్నది పెంచుమన్నా!
వొట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టి మేల్ తలపెట్టవోయ్!

౨

పాడిపంటలు పొంగిపొర్లే
దారిలో నువు పాటుపడవోయ్
తిండి కలిగితె కండ కలదోయ్
కండ కలవాడేను మనిషోయ్!

౩.

ఈసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునోయ్.
జల్దుకొని కళలెల్ల నేర్చుకు
దేశిసరుకులు నింపవోయ్.

మందగించక ముందు అడుగేయి
వెనకపడితే వెనకేనోయి !

పూను స్పర్థను విద్యలందే
వైరములు వాణిజ్యమందే;
వ్యర్థ కలహం పెంచబోకోయి
కత్తివైరం కాల్చవోయి !

దేశాభిమానం నాకు కద్దని
వట్టిగొప్పలు చెప్పుకోకోయి;
పూని యేదైనాను వొకమేల్
కూర్చి జనులకు చూపవోయి !

ఓర్వలేమి పిశాచి దేశం
మూలుగులు పీల్చేసెనోయి;
ఒరుల మేలుకు సంతసిస్తూ
ఐకమత్యం నేర్చవోయి !

పరుల కలిమికి పొర్లి యేడ్చే
పాపి కెక్కడ సుఖం కద్దోయి ;
ఒకరి మేల్ తన మేలనెంచే
నేర్పరికి మేల్ కొల్లలోయి !

స్వంతలాభం కొంతమానుకు
పొరుగువాడికి తోడు పడవోయి

దేశమంటే మట్టికాదోయి
దేశమంటే మనుషు లోయి ;

చెట్టపట్టాల్ పట్టుకుని
దేశస్థులంతా నడవవలె నోయి;
అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలె నోయి ;

మతం వేరైతేను యేమోయి ?
మనసు వొకమై మనుషులుంటే
జాతమన్నది లేచి పెరిగి
లోకమున రాణించు నోయి !

దేశమనియెడి దొడ్డవృక్షం
ప్రేమలను పూలెత్తవలె నోయి
నరుల చమటను తడిసి మూలం
ధనం పంటలు పండవలె నోయి !

ఆకులందున అణగి మణగీ
కవిత కోయిల పలకవలె నోయి
పలుకులను విని దేశమం దభి
మానములు మొలకెత్తవలె నోయి

ఆరవ ఆగష్టు

హిరోషిమా నగరు దీక్షయాక్షం
శస్త్రపక్షము ముష్టిమాపెను
నరుల పీనుగ పెంట పోకల
నాటి వెలియును నేంటి వక్షకుల.

శోకసంద్రము పోతిపెట్టును
యుద్ధముల కవి ఉనికిపట్టులు
లోక సంతతము ఏకమై
యుద్ధమును మారణము చేయును.

వచ్చె నిది బంగారు కాలము
వాంఛ లెల్లను తీరు సుజనుల
కాంగితేయుల ధర్మరాజ్యము
జ్ఞానమును స్వాతంత్ర్య మిచ్చునే
సంతతము వర్ధిల్లగావలె ?

బంగరెత్తువము

పెరిగి పెరిగితి; పెరిగి విరిగితి;
కష్టసుఖములపాల మెరిగితి;
పండుదున్నావె ఆశ లెన్నో
పొంది రాలగ పొగిలితిన్.

అందజాలని పళ్ళకోసము
అఱ్ఱు జాపితి; నేల పాకిన
చెల్లి పళ్ళను విలువ తెరుగక
పాదరక్షల మెట్టితిన్.

తీపి విరిగిన చెరకువలె ఆ
నాటి కోర్కెలు నేడు వెండొ
పెంచి నవ్వితి; బుద్ధి చపలత
కొత్త కోర్కెల తగిలితిన్.

పెద్దలతో పోరు కూడితి
రక్కసులతో కూడి ఆడితి
కొత్తమనుష్యుల తెలివిపటిమను
మంచిపెద్దల మార్చితిన్.

చూతునా ! అని చూసితిని; మరి
చేతునా ! అని చేసితిని; ఇక

పూజ చేయగరాని వింతలు
చూపి కన్నులు కట్టితిన్.

శత్రుమిత్రుల కిచ్చి నెనరులు
స్నేహవార్ధిని కొల్లగొంటివి;
నాటిమిత్రులు తరల శూన్యం
బైన పుడమిని నిలచితిన్.

పంజరంబున నున్న కట్లను
పగలదన్నగలేక స్రుక్కితి;
వింగిపర్వగ లేని జన్మము
నీరసంబని రోసితిన్.

“ఉసురులకు వెసికితివా ? యుద్ధము
కలదు; దేశముకొరకు పోదుము”
యుద్ధమా ? ఇక నేమి లోకము !
చాలు ! చాలును ! లంగరెత్తుము.

ఎం బాం గుం రం లు

మల్లెలు మొల్లలు పూచే వేళ
చల్లని గాలులు వీచే వేళ
మేనుల గంధం బలదే వేళ
ఉరుములు మెరుపులు మెరసే వేళ
తొలకరివానలు కురిసే వేళ
మామిడిపండులు పండే వేళ
మన్మథ బాణము మ్రోగే వేళ
మగువల మనసులు క్రాగే వేళ!

బూరుగుచెట్టు
చిలకలతోను
ఏమని పలికింది?
పండిన పండు
ఎండిన దూదై
పకపక నవ్వింది!

చిలకల్లార!
చిలకల్లార!
కలవంతోను
ఏమని పలికారు?

"కలవల్లారా!
కలవల్లారా!

రాజు వచ్చెను
కన్నులు విప్పండి!
కల వచ్చెరా!
కథ వచ్చెరా!
రాజు ప్రొంటెను
కన్నులు మూయండి"!

అరటికాయ బజ్జి
మినపప్పప్పు బొజ్జి
కలసి మెలసి తిందాం
కథలు వినలు వింటాం!

ఏనుగు ఎక్కి మనం
ఏ వూరు వెళదాం?
ఏనుగు ఎక్కి మనం
ఏలూరు వెళదాం!

గుర్రం ఎక్కి మనం
ఏ వూరు వెళదాం?
గుర్రంఎక్కి మనం
గుంటూరు వెళదాం!

మోటారెక్కి మనం
ఏ వూరు వెళదాం?

మోటారెక్కి మనం
మోటారు దిగదాం :
పెన్నుని ఎక్కి మనం
ఏ ఊరు దిగదాం ?
పెన్నుని ఎక్కి మనం
పేదవాళ్ళకి చేరదాం ;

• బొట్టు

నూగు మీసపు కట్టు
కానరాని బొట్టు
నోటాన సిగరెట్టు
కోటు వింత కుట్టు
చేకట్టు జిలుగు వెండికట్టు
నీలగిరి కొలనుగట్టు
పై విహరించు వైష్ణవభొట్టు.

• విజయనగర సంస్థానోద్యోగులు శ్రీ చక్రవర్తుల తాతాచార్యులు గారు, మహాకవి నీలగిరిలోవున్నప్పుడు, తనపై ఒక గీతమును చెప్పమని అడిగిరట. అపుడు మహాకవి ఈ గీతమును చెప్పిరట. తాతాచార్యులుగారు కీ. శే. కిళాంబి రామానుజాచార్యులుగారికి బావమరది. కీ. శే. కిళాంబి రంగాచార్యులుగారికి మామగారు; వారికి మహాకవివద్ద చేరిక ఎక్కువ.

నీలగిరి పాటలు

రాగము. సురట — తాళము, ఆది.

పల్లవి

సుందరతర మీ నీలనగము దీని
చందము హృదయానందకరము దీని
చందము హృదయానందకరము.

అను పల్లవి

నందనవన మిదె — నాతిరో వింటివె
బృందారక ముని — బృంద సేవితము

చరణములు

ఎచ్చటఁ జూచినఁ — బచ్చిక పట్టులు
పొదపొద రొదలిడు — పొలుపగు పిట్టలు
వింతవాసనలు — వీచెడు చెట్టులు
కుదురు రథ్యగల — కొలకుల గట్టులు.

విచ్చలు నగములు — పేటగు తోటలు
విచ్చలవిడి చను — వచ్చపు మొగుళుల
వచ్చరఁ గేరెడు — మచ్చెకంటు లిట
మించు తీవలన — మించి చరింతురు.

పాదఘట్టనకుఁ బర్వుచక్రములు
మంత్రమహిమ నగు — జంత్రపురత్నములు

[illegible]డి ను పాలెము - పటు జవనాశ్వము
[illegible]మగా [illegible] - గ్రంథము రోహము
[illegible]ష్ట్ర రోషము [illegible] - గా[illegible]చవప్పరల
[illegible]ష్ట్రిగోతేజముల - మదుపుల [illegible]పుల
[illegible]త్త్ర బెరియగ - పెల్లువలై వెరు
[illegible] సమ్మదాన - అక్కయ ముయ్యేను
[illegible]స్పృత భృత్యాలి - నెప్పుడు ప్రోచెడి
[illegible]లకొందయ - మాంచాదేవిని
[illegible]ప్పగ ప్రోచుత - నప్పుర దమను[illegible]
[illegible]ష్ట సరముల - విష్ణుగ [illegible]

ఊటీ చోద్యమేమి చెప్పుదు.

రాగము, పంతువరాళి—తాళము, రూపకము.

పల్లవి

ఊటి చోద్యమేమి చెప్పుదు
సువిద వింటివే

అనుపల్లవి

పాటిమేమి యూటికెందు
స్వర్గమైన దీని క్రింద

చరణములు

వాలుమైన తలములందుఁ
దోటలెంతో సొంపుమీరఁ
గూటములను సౌధరాజి
కుదిరి మెరయగా
మాటుపడగి శివుని జటా
జూటమునను గంగ పగిది
కోటహ్రదములందు జలము
కొలరి యపురి యుండును ॥ఊటీ॥

పంతు వెన్నె లచటి పవలు
పాచకుండు రాత్రులందు

పండమండి యింటి నింపి
పయను ప్రోవఁగ
సెండ పాడి కోఁడి సీకు
కొండ వత్రై నేమొ యనఁగ
నిండుకొలువు పేషంత
మండి యిపటి వెలసెను ॥ పా ॥

వెన్నెని సిగ నమరి యున్న
వేల్పుతరువు విరులమూడి పై
సన్న సన్న వెండిమబ్బు
చకెయు అంటగా
మిన్నుబాయు సంజకోఁడు
మేళవించు రంగులనఁగ
వన్నె వన్నె పూలగములు
వనము గ్రమ్మి పొరయును ॥ పా ॥

ఉమాపతి యర్చన

రాగము. భైరవి - తాళము, చాపు, మిశ్రజాతి

పల్లవి

ఉపరికమండలమున - నుమాపతి యర్చన
కోటిగుణితమై - కోరిక లీడేర్చును

అనుపల్లవి

వెల్లనౌ మబ్బులు - విరిసి వెన్నెల గాయ
వెండి కొండవలె సురలు - వేడ్కతో రాగ

చరణములు

కర్పూర తరువులు - కంబములై తోప
మిన్ను పందిరిఁబోల - మించు దివ్వెలుగా
పచ్చల కాసియించు - పచ్చికపై విరు
లచ్చర లిడు ముగ్గు - టచ్చున వెలయఁగ.

దేవదారు తరులు - దివ్యగంధము లీన
యక్షగానము మీఁటి - పక్షులు పలుక
రసికమల్లిదె శంఖ - రావమై చెలఁగఁగ
దీవరేములు పూలు - తిరముగఁ గురియఁగ-

ఆశ్రితవరదుఁ - డంబికారమణుఁడు
బాలచంద్రమౌళి - భక్తికి సేవమెచ్చి
రాజరాజపుత్త్రి - రాజ్ఞి నవ్వులకొంత
యాంబఁ ద్రోచుగాత - నధిక సౌఖ్యము లిచ్చి.

నాటి మాట

రాగము అఠాణా - తాళము రూపకము.

పల్లవి

నాటి మాట మఱచుటయే
నాటికైన మఱవ వశమ.

అనుపల్లవి

బోటి ప్రాణ మీవంటి ము
మ్మాటికి విను విడ నంటి.

చరణములు

మాటు:మాట గట్టికొని
పాటిదప్పి తనుట నా పౌర
పాటుగాక మాటన నే
పాటిర నీసాటి దొరకు.

బ్రతుకునందు లేని స్థిరత
వెతకనేల భాషయందు
నతుకు వేషభాష కోడు
వతివలడే తప్పు గాక.

సాటిలేదు నా కంటి నా
మాట నిజము నేడు గంటి

పొంటి కలదె నమిత్ర భంగ
పాటు పడిన పడతికెంము.

మేటి పైన నీమొద పొఁగ
మాటమెటులఁజాపె. నాక్రు
మాటురా. నీ మాటుమాకె
కోటి ధనము లిచ్చి కొంము.

వేసాకో మంత్రములు

రాగము. శంకరాభరణము - తాళము. ఝంపె.

వేసాకో మంత్రములు - తేటగాఁ జేయునిను
హా పపుడు బయలుబడు నొకొ్క
కా వనుచు సిలాటి కొంతునకుఁ జిక్కి నీ
ప్రావమున నలయి కనబడువో.

మంచియును చెడ్డయును మానమును గనక పటు
వంచనను పరకొంత దగిలి
ఋంచుకయినను లోకమెంచునని భీతిలక
కొంచెతన మూను టది కోమరా.

మగఁడవై పగతీర్చు పగతుఁడవు గాక నిడ
తగు సటర తలపోయ కుంట
మిగిలినది లేదు రిక మీఁద నిను నమ్మినా
నగధరుని నమ్మెదను రేరా.

చిత్తరువని చూడ

రాగము, శంకరాభరణము - తాళము, మిశ్రచాపు.

పల్లవి

చిత్తరువని చూడఁ జిత్తము గొంకీని
చిత్రజు నపరంజి చిలుక యెవ్వతెవే.

అనుపల్లవి

పత్తువా సామ్రాజ్య - వలరాజు వేఁచిన
ముత్తకారిని యిదు - మనమైన నీగదె.

చరణములు

ఇచ్చిపుచ్చుకొంటు - యిలలోని మర్యాద
ముచ్చిలి మౌనము - మెచ్చు దుర టవే
వచ్చి చూచినంత - వంచనఁ జేయుదె
వచ్చి దొంగతనము - వదలితివా పరువే.
మనసులేని తనువు - మరి యేలనే నాకు
పెనటి దీనిఁ గూడ - చేకొనఁ దగవె
నావికి బదులొక్క - నాకిచ్చి నే వేఁడెద
మూవిని యీ పాటి - మన్నింపఁ జెల్లునే.
విలువ చాలదన్న - విరివిల్తుకై నాన
కలుగు జన్మములఁ - గానుక కొనవె
ఎలిమి నా నందేంద్రుడు - నేలిన వెన్నుఁడు
పలు తెఱఁగుల మేలు - పడతి నీ కిచ్చునే.

SONGS ON THE BLUE HILLS *

Chorus : Beautiful are the Blue Hills, and their beauty gladdens the heart. Verily this is the garden of the gods, and gods and sages love to roam here.

Everywhere the eye meets expanses of green grass. Birds sing sweetly from every bush. The pine odours fill the air. Lovely drives sweep round limpid lakes.

In the masses of clouds that love to haunt the gardens on the hill slopes, fish-eyed damsels flit about like lightnings.

Wheels that speed under tread, cars that mock the powers of magic, add swift horses that race move along in beauty.

On ridges and in valleys, in lakes and in forests, and in pots in glass houses, flowers grow everywhere in profusion. So the quivers of the god of love are inexhaustible here.

May Siva, the Destroyer of the Puras shower choice blessings, on Appala Kondayamba Devi, who is kind to her servants.

---

* నీలగిరి పాటలకు మహాకవి అనువాదం *

THE WONDERS OF OOTY

Chorus : Listen, friend, how can I describe the wonders of Ooty?
Ooty has no equal;
Heaven itself is inferior.

Beautiful gardens cover the gentle slopes of the hills, and palaces glitter on the peaks. Like Ganga on Siva's head, a hundred lakes nestle in the valleys.

Here sunshine is mellow as moonlight and at night, the fire gods give comfort in every home. Worsted by Summer on the plains, Winter has taken to these mountains fastnesses and holes sway here.

Silver clouds rest on the peaks like Kalpa blossoms on the head of Krishna, and many-hued flowers spread over the hill sides and shine like colours mixed by Evening to paint the dome of heaven.

Come, friends, our merit has attained fruiton, and we are enabled to see the great Blue Hills by the kindness of the king s daughter Appala Kondayamba.

WORSHIP THE LORD OF UMA

Chorus : Worship the Lord of Uma on the Blue Hills and you acquire merit a thousand - fold.

White clouds envelop the peaks and make moonlight—and gods take the Blue Hills for the silver mountains and crowd with enthu - siasm.

They witness Nature's worship of Siva there. The tall eucalyptuses form columns and the sky the awning. Lightning serves for lights and flower bedsin the midst of green grass look like ornamentation of the floor by wood-nymphs in coloured powders.

The pines waft divine odours,and the birds sing as never nymphs sang. The thunder serves as the music of the conch-shell and creeper damsels shed flowers.

May the Lord of Ambika who wears the moon-crescent as a crest-jewel save Maharani Appala Kondayamba daughter of the great king, pleased with her devotion.

THAT WORD OF LONG AGO

Chorus: Can I forget your forgetting that word of long ago? You said I was your life. You promised never to part.

To treasure a "word" and to task you with unfaith is "my" fault. Of what count is a "word" to a great one like you?

Women are to blame who turn thrall to words and ways that are not of the man.

You said I had no equal. I now realise the truth of it. Where will one find another woman like me who trusted and suffered!

How has compassion left the breast of great one like you? Come to me but once and I will buy even your false word for a crore of gold.

IS THERE NO MAGIC?

Is there no magic that will transform you into a woman? Would then your courage become plain? Would you, entangled in the wiles of a lord like you, suffer pangs of the heart?

Not to consider good and bad, and hon - our and to take to another man's wife, not to heed the talk of the world, and to grow little—was that wise?

Are you a foeman of previous birth born as husband to be revenged?

Not too late. I shall not trust you here - after,

I shall trust in God!

I TOOK YOU FOR A PICTURE!

Chorus : I took you for a picture and looked. You stole my heart. Who may you be, O gold parrot of the god of love?

If I pray of him will he send you to me? Beautiful one, at least give me "your" heart. To give and take is the rule of the world. Do the wise approve of stealth and silence? Is one to be cheated for going and seeing? Is open robbery a credit?

What do I want with a body devoid of mind? So take that also. In return for both I crave but a 'word'. Oh, fair one, you may concede this much.

If you think the price small, I present to you lives to come, and I call the god of love to witness. May Vishnu who ruled the heart of prince Anandaraja bless you!

పాటలముబ్బులు

దబ్బరలుం గొంచెమ్ములు
ముబ్బవలెం గ్రమ్మి మాయమాటల తీపున్
నిబ్బరపు మొండితనమును
నబ్బురముగ విద్యలచటి యధికారులకున్.

తనకొక మేలు చేకురగ తక్కినవారికి గీడు సేయుటల్
మనమునవేని భక్తి యభిమానము మాటలలోనే చూపుటల్
గొనకెటు లాభముల్ గలుగు ? గొంకక నాటకమాడ సాగుటల్
ఘనమునకు న్మహోన్నతికి దారులు రాజ గృహాంతరంబులన్.

కెంజిగురుల కోయిల, సుమ
మంజరులన్ దేటిగముల, మనుజ ఖగములన్
మంజుల ఫలముల, చూతమ !
రంజించెద వితర తరులు రా వాదనకున్.

విధివశమున నీ చెంతకు
మధుపము రా హేళనంపు మాటాడకుమా
మధు వొలుకు జలజ కులముల
కధికపు నెయ్యుండగు కుటజమా ! తెలియు మెదన్.

పుష్పలావికలు

వెన్నెలగాయు కుందములు వేళ నెరుంగక బూయ కల్వలన్
జున్నలు జారగాగుడిపి చొక్కుల నెక్కుడు తేల్చుతమ్ములన్
జెన్నువహించె నీ కడను చేరగ నిమ్మిక యన్యమేల నే
వెన్నని యాన యిచ్చెదను వేడిని బొమ్మల నంద్రుకామినుల్.

మోసములాయె లావికరో మొన్నను నే తొగలెత్త నీ కడన్
మూసెగృహంబు చేరుతరి మోమనుచందురుగానమిన్ పు డా
వాసము జేరి కల్వలకు బాసట జేయుట నమ్మితేని నిన్
గాసుల నోలలార్చెదను కాదనక న్మొయి రమ్మనున్ విటుల్.

గోరుల డాలు దండలకు గూర్పగ గెంజిగి నెర్ర మొల్ల లిం
పారగ జూడగా గలిగె నన్నువ తెమ్మని తీసి యింటికిన్
జేరగ తెల్లవారగని చింతిలి తారను దెల్లవారి ర
య్యారను గల్గు లావికల యోజలు చిత్రములంచు జవ్వనుల్.

నీ దండ చిక్కువడె నే
నా దండను చిక్కటన్న నగరే ప్రాజ్ఞుల్
నీ దండ నుంచికొనుమా
వాదుడుగు మటంచు రచటి వనితలు విటులున్.

అరపవి మోముల సామిని
విరులవి యొక రెండో మూడో విరియగ జేసెన్

విరు ల వ్వారిగ బఱపెడు
విరు బోడులు విటుల తూల్చ వింతయె దలపన్.

కుసుమశర విద్ధు లయ్యును
కుసుమంబులె కొందు రచటి కోవిదులు విటుల్
విసమునకు మందు విసమగు
వసమాయుధు వేటు తీట లలరుటె మాన్పున్.

చూతము మీ మీ జాతుల
జాతిరా యన విటులు బల్కె నగి లావికలున్
ప్రీతిగలదేని జాతులు
జూతురె మా జాతులెల్ల జోద్యము లనరే.

చక్కదనంబు నశ్వరము చానరొ వింటివె నీవు నాయెడం
జిక్కతనంబు జూపుటిటు చెల్లునె లోభి ధనంబు సర్వముం
బొక్కసమందు దాచుగతి బొంగెడు నా వెలలేని సొంపు నా
మక్కువనెల్ల గొంటి వొకమాట నొసంగుట భారమయ్యెనే!

చక్కదనంబు నశ్వరము సత్యమె మక్కువ లెల్లకాలమున్
మిక్కుటమై చెలంగునొకొ మిత్రమ చీమలు చుట్టుముట్టుచుం
జక్కెర చెల్లుదాక బలు సందడి జేయుచు వీడు కైవడిన్
జొక్కపుప్రాయ మేగుతరి సున్నకదా మగవారి మక్కువల్

మెరుపులు**

ఈవియు దియ్యని మాటయు
భావంబున జేయతగిన పని తెలియుటయున్
ఠీవియగు ధైర్యభావము
రావు సుమీ యొకనివలన రావలె తనతోన్. *

మానినులు గాని యింతుల
తా నేర్పని నేర్పు చెలగు తరి జెప్పంగా
జ్ఞానవతుల కగునె పికము
దాని శిశువుల బెంచు నెగురుదాక నౌరువేసె.

గడ్డితిను కారుమెకములు
బొడ్డున కస్తూరి నునిచి పొలియగ వేసెన్
జడ్డివిధి దుష్టజిహ్వల
నొడ్డిన సమకూడు శుభము లుర్విజనులకున్.

అడచుకొన కింద్రియంబుల
విడుమల కది శ్రోవయండ్రు యివి యడచుటయే

** ఇవి కొన్ని సంస్కృత శ్లోకములకు మహాకవి తెనిగింపు. వారి అనువాదసరళిని తెలుపుటకు అక్కడక్కడ మూడు మూలశ్లోకములను పొందుపరిచాము.

* దాతృత్వం ప్రియ వక్తృత్వం
ధీరత్వ ముచితజ్ఞతా
అభ్యాసేన న లభ్యంతే
చత్వార స్సహజాగుణాః

కడుసంపదలకు బొటిగు
వడుమేతేరవిష్టమొదవు నా మార్గమునన్.

కాశి జచ్చెనేని కలుగదు జన్మంబు
కలిగెనేని నుదుట కలుగు కన్ను
సిరసునందు చిన్ని సిరితోడు బుట్టువు
కంఠసీమ వెలయు గరళచిహ్న ••

నాల్గురీతుల గనకంబు నాడెమగును
పేటుగీటుల తునియించి వెచ్చజేసి
నరుడు నట్టులు నాల్గింట నాడెమగును
కులము శీలంబు కర్మంబు గుణముచేత. •

•• కాశ్యా మవశ్యం త్యజతాం శరీరం
శరీరిణాం నాస్తి పునశ్శరీరం
యద్యస్తి కంఠే గరళం లలాటే
విలోచనం చంద్రకళాచ మౌళౌ.

• యథా చతుర్భిః కనకం పరీక్ష్యతే
నికర్షణచ్ఛేదన తాప తాడనైః
తథా చతుర్భిః పురుషః పరీక్ష్యతే
కులేన శీలేన గుణేన కర్మణా.

సుభద్ర

షంముగ చండిగఁ బర్వెను
గొందకు నలుగడల; నొక్కకోనను విడిగా
నుండి కిరీటియుఁ గృష్ణుఁడు
మెండగు షంతనములందు మెలఁగెడు వేళన్.

కలకల నగవులు మగువల
కలభాషలు నంగదముల గలగల రవముల్
చెలఁగి, వనవీథి నొకతటి
నల విఱిగిన భంగి, విఱివి యణఁగె బొదలలోన్.

అంతట నొక్కకాంత, యల, కాంతము లల్లలనాడఁ దెమ్మెరన్
జెంత వనాంతము న్వెడలి చేరఁ జనెం; దొవకావి చీరపై
వింతమెఱుంగు రశ్మికలు వెల్వఁగ బంగరు కత్తెళంబు, వి
క్రాంతవిలాసముల్ నడలఁ గన్నులఁ జెమ్మల వెల్లిగొల్పుచున్.

అడుగడుగున నూపుగముల
చడి, వీణియ మీటుమాడ్కి సలుప, నరునకున్
గడు హృదయాహ్లాదము, నొక
* పడఁతుక యేతెంచి నిలిచెఁ బజ్జను హరికిన్.

ఈరెండ దాఁకి చెదరగ
నీరజముఖి తళుకు మేన, నెలతుక మించెన్

---

* పాఠాంతరము:- పడఁతుక యేతెంచి కృష్ణు పజ్జను నిలిచెన్.

వారిజ కింజల్క శ్రీ
వారంబున వెలసి మెఱయు వరలక్ష్మి క్రియన్.

గళితఘోరంగు గొల్పె నరుకన్నులకున్ మిఱుమిట్లు; చూడ్కుల
మ్మరుని కటారులై పొడువ మర్మము, దిగ్భ్రమమావహిల్లె; సుం
దరి ధనువూను సోయగము ధైర్యముఁ ద్రిప్పె; వినుండుదోచె మో
మరయ; నెఱుంగఁ దిట్టి యసమాన్విత విక్రమమెట్టిపోరులన్.

"అమ్మా!" యని చెలిశిరమున
నెమ్మి గరంబుంచి పలికె నీరజనేత్రుం
"డిమ్మౌని కరుణ సౌభా
గ్యమ్ముల నవ్వారిగాఁగ గాంచెద" వంచున్.

కపటమౌనిఁ జూచి కన్నియఁ జూచుచు
గన్నెఁజూచి కపటమౌనిఁజూచి
చిత్తమలరఁ దలఁచెఁ జిత్తజ జనకుండు
నేఁడు గంటి నలువ నేర్పటంచు.

మొలకనగవు దోప మోమున, వసుదేవ
తనయుఁ డనియె మాయ తపసితోడ;
"కాదె భావినీకుఁ గరతలామలకంబు
మౌనివర్య! కలదు మనవి యొకటి.

భద్ర యిదె కొలిచె రైవత
కాద్రిని వరుఁగోరి; కరుణఁ నరసి తెలుపుఁడీ!

ప్రథితగుణో, వరుణుడో, వి
త్న్రవ పరాక్రముఁడు నరుఁడో నీరజభవుఁడో!"

చెప్పుల దాఁచిన నగవులు
ముప్పిరిగొని ముందు కుబుకు మురహరు మోమున్
విప్పుఁగనుల వీక్షించుచు
నెప్పగిదినిఁ బలుక నేర కింద్రజుఁ డున్నన్.

హరి యనియె "నిట్టి సిద్ధుఁ
మఱుఁగు పఱుతురప్ప క్రొత్త మనుజులకడఁ దా
డెఱిఁగిన యర్థం బయినను;
గురుతర పరిచర్యఁ గూడి కూర్తురు శుభముల్.

* ఘటనా ఘటన సమర్థులు
గుటిలపు విధివ్రాఁతనైనఁ గుదురుపఱచు వా
క్పటిమ గల పురుషసింహము
లెట పఱచుఁ గటాక్ష మొదవు నీప్సితము లటన్.

కేవల నరుఁడే యీతఁడు
భూవలయము చుట్టి పుణ్యభూము లరయుచున్
రావలసి వచ్చె నిట నినుఁ
బ్రోవను; సేవించి వేడ్కఁ బొందుము శుభముల్.

---

* పాఠాంతరము:- ఘటనా ఘటన సమర్థులు
నిటలంబున బ్రహ్మవ్రాయు నిర్ణయ ఫక్కిం
బటు నిష్ఠా పాటవమున
నటునిటు సేయంగనేర్తు రార్తులఁ బ్రోవన్.

కాంచి నరు సుభద్ర 'కంటివా మును వీని'
నన్న శంక మనసు నలమికొనఁగ
'నెఱుఁగకున్న వీని నెఱిగినట్లున్నది;
మంచిగూర్చు' ననుచు మదిఁ దలంచె.

'అన్న వీనినెన్న నధికుఁడు కానోపు
నెన్నకున్న వీని చెన్నుఁజూడ
నన్నుఁ బ్రోవవచ్చె నరరూపమును దాల్చి
మానవైరి యంచు మదిని దోఁచె.

నరుఁ గూర్చిన నరుఁ గూర్చును
నరుఁ గూర్పక యున్న నాకు నరుఁడె గురుడై
దరిఁజేర్చుఃని హామి నోచఁమిఁ
బర సాధనమైనఁ గనుట పాడి దలంపన్.

పెద్ద యన్ననరుని పేరైన వినవొల్లఁ
డొరుని కెపుడు నన్ను నొసఁగఁ జూచు
గురుల చేతనుండుఁ దరుణీజనము పెంపు,
వారు మెచ్చువాఁడె వరుఁడు మరుఁడు.

కించ యేల నాకు కృష్ణుడు నా యెడ
నున్నవాఁడు లోక మెన్నువాఁడు
వాని పనుపు సేయ వమ్మగా దేనాడు
యతిని గొలిచి విజయ నధిగమింతు.'

అర్జునుండు దలచె 'నమృతంబుఁ గొనునాఁడు
పెన్నుఁ జెత్తినట్టి వేస మిదియె
చిప్పఁ గన్నులందు వెలయు ప్రసాదంబు
చిప్ప గప్పినట్టి విపులగాదె ?

పసితనపు టాటపాటల
విసువని విలువిద్య దొడ్డ వేడ్క జెలంగన్
గుసుమాస్త్రుఁ డెన్నఁ డెరుఁగని
యసమాయుధ కౌశలంబు లబ్బె గరితకున్.

లఘు నమనోన్న మనంబును
లఘు రయమును నంగముల విలసితము లగుటన్
సుఘటిత లావణ్య శ్రీ
జాఘన ఘనకుఁ దెచ్చికొనని సౌరు లమర్చెన్.

వీరుఁడన్నవాఁడు వీరంబుగల యిట్టి
భామ నేలు భాగ్య మొదవె నేని
గాల ముండు దనకుఁ గతలందు నుతికెక్క
కడిమి మీఱు సుతునిఁ బడయు కన్నె.

వాసుదేవుఁ డపుడె వాగ్దాన మొనరించెఁ
గొంచు దీవి నడ్డ మెందతైన
రామ్ముఁ డొకడు దక్క రౌహిణేయునిఁ బోర
గడఁగరాదు గనులు గప్పవలయు'

తలఁచె నిట్లు వరుఁడు; తలఁచి నంతనె వచ్చెఁ
దాటిసిడపుజోడు; తప్పటడుగు
మేని చందనంబు మైకంపుఁ గనుమూపు
పండుగాడినట్టి విందు దెలుప.

ఎఱ్ఱఁగిరి భద్రయుఁ గృష్ణుఁడు;
సరుఁడ వనత వదనుఁడయ్యె; నగి బలరాముం
"డరసితి" ననె "మిముగానక
దొరకితి రిపు డిచటఁ దోడిదొంగ లిరువురున్.

సరి, సరి, మునియొకఁ డమరెనా !
మఱి కృష్ణుఁడు మఱచు జగము; మన భద్ర న్నన్
వరుఁ గోరి తపముఁ జేసెడి;
గురు జపములఁ గన్న సేవ గురుకొని చేయున్.

కూర్చుండుఁడయ్య మీరలు
కూర్చుందము మనము; వింతె కురువీరులలో
నేర్చు మగఁ డతఁ డితం డని
యేర్చుచు వాదిడిరి బాలు రెఱుఁగుదు చెపుమా !

వసునియెడఁ బక్షపాతము
పలుపక "యున్నట్టి మాట పల్కుము"; పల్కెన్
హరి "యెటు పలుకం జెల్లును
బిరులకు ? ఈ మేటితపసి ప్రక్కనె యుండన్.

షల యెల్లం గాలించుచు
మలసి మలసి పురుషవరుల మహిమాన్వితులున్
గలసి భవ మీఁదు తెఱువుల
తెలియుఁ దిగులు మనములోనఁ దివిరి కొనంగన్.

ఎన్నాఁడట హరి యీనాఁ
డున్నాఁ డవతారమెత్తి యుర్వి నవి యతఁ
డన్నారట నీవేయని
కన్నారఁగ నిన్ను గాంచఁగా నిటు వచ్చెన్."

గొంతుకొంకిత మార్చుకొని గొంతిసుతుండనె "నోబలాఢ్య! నీ
యంతటివాని ముందొరులనౌనెగణింప; మనుష్యమాత్రు లా
వెంత; భవిష్యమెంత! జనులేలయెఱుంగరొ విన్నెఱింగిమున్
సంతత సత్యవర్తనమె సత్వము జీవులకన్న ధర్మమున్.

ధర్మ ముండుచోట దైవ బలంబుండుఁ,
గలుగ దైవబలము గలుగు జయము,
విజ్ఞపీఁగు జడుఁడు విజయంబు దనదంచు
మున్న లోకపాలు రెన్నినట్లు.

అని మొననొంచి రక్కసుల నాత్మబలంబులె కారణంబుగాఁ
గాని రమరుల్ జయంబునకుఁ గొందొక యక్షమెసిర్చి గాలి వ
హ్నినిగని మీరలీతృణము కేల్గొని త్రోయుఁడు కాల్చుఁడన్నవా
రనువది గామి గుర్తెఱిఁగి రాత్మబలంబుల పారతంత్ర్యమున్.

ఐనను వృష్ణికుమారులు
పైని గనంగలరు పోటువాసులు; పోరెం
దైనఁ బొసంగరు వెన్నె దురఖి
మానము కౌరవుల యెడల మల్లడిలంగన్.

కల దంత శ్శత్రుచయం
బలముబలం బాప్తవేష మతిమానుషమై
యలయించు నెంతవారల
వెలి శత్రుని వెతకువాఁడు వెడఁగు దలంపన్.

కావున శత్రుని మిత్రుఁగ
నే నెరవున నైనఁ జేయు నేర్పరి బలియుం
డావల నంతశ్శత్రుల
కావర మణఁగింపగలఁడు కాల మలవడన్.

ఎఱుఁగనియ ట్లొరు నడుగుట
మఱుఁగుపఱచి దైవజన్మ, మానుష లీలల్
నెరపుట గాకీ వెఱుఁగని
పరమార్థం బొందు గలదె ప్రజ్ఞాననిధీ.

ఎద్దానికైన మీరలు
దిద్దక మముబొంట్లు నిజము తెలివెఱుఁగుటగా
దద్దారి గనక వట్టివి
సుద్దులు నేర్చితిమి; యగునె సూక్తులను బనుల్.

వసుదేవుని బిడ్డలు మీ
రసదృశ మహిమానుభావు లాప్తులు చెంతన్
వసియించి కొంతకాలము
పసగల సద్వస్తు వొకటి పట్టఁదలఁచితిన్.

కుంతిని మిము ధన్యుఁడ నను
కొంటిని; మీవంటివారు కూరుట తపపుం
బంటకదా; నను గనుఁడొక
పంటను, గన్నంతనాకుఁ గల్గు శుభంబుల్."

ప్రేమ పెనగొన్న చూపున
రాముఁడు తన తమ్ముఁ జూచి రంజిలి పల్కెన్.
"శ్రీమంతుం డీతాపసుఁ
డేమందును మనదు భాగ్య మెఱిఁగితి మితనిన్.

కలరిల నెందఱో యతులు కాంచియెఱుంగము వీనియట్టి వి
స్తుల సదసద్వివేకనిధి సూనృతవాక్యుల నాభిరాము స
ల్లలిత మహానుభావు విమలాత్ము విచక్షణు, నిట్టివానిఁ బూ
జలఁ దనియించి కొన్నిదివసంబులు నిల్పుట యుంటనొప్పదే.

యదువీరులెల్ల నీఘను
వదను లెఱిఁగి భక్తిఁగొల్వ నాత్మజ్ఞానం
బొదవు; భవజలధి గడపెడు
చదువుం దలపడుట పూర్వజన్మఫలమె కా?

ఎందెందుఁగలుగు తీర్థము
లందలి మహిమలను నీ మహాత్మునివలనన్
న్విందదము; పరమార్థంబులఁ
గందము! వీనులకు విందుగద సూనృతముల్.

మనభద్రయు సీతపసిని
బనిగొని సద్భక్తి భోజ్యభక్ష్యంబులచేఁ
దనిపెడుఁగా కద్దానను
గనకున్నె రాజరాజుఁ గాంతునిఁ గాఁగన్."

గారాబ మొలుక్కకన్నుల
నారాముఁడు భద్రఁగాంచి పరునికనియె "ఓ
నారీమణి రైవతకము
నారాధించిన ఫలంబయో నినుఁ గాంచెన్.

సీదాసిగ గొని చెలియల
నేదానను లోపమున్న నెఱుఁగఁ దెలుపుచున్
మోదానఁ గొనుఁడు పూజలఁ
గాదనకుఁడు ముద్దుగడపి కారుణ్యముతోన్.

కత్తిమొన బ్రతుకు జోదుల
పొత్తుగదా బ్రహ్మవ్రాసెఁ బొలఁతులకును మా
యుత్తమ రాజకులంబుల
నెత్తమ్మికి విశితకరుని నెయ్యమువోలెన్.

బాణాసన తూణ తను
త్రాణము శైశవమునుండి తాల్చుచు నొక వి
న్నాణంపు జోదు తానై
ప్రాణంబుల సరకుగొనదు భద్రమగఁటిమిన్.

పుట్టింటనుండు కాలం
బెట్టెట్టుగనున్నఁ జెల్లు నింతికి, మఱి తా
మెట్టిన యింటను మెలఁగెడు
గుట్టు తెలియకున్న నెట్లు కూరుఁ సుఖంబుల్.

దారుణము క్షత్రధర్మం
బీరసముల కిరవు దొల్లి యేర్పఱచిరి. యే
కారణమొ ధర్మకర్తలు
పూరుషులకుఁ జెల్లుఁగాక పొలఁతుల కేలా?

పారంబులేని యోరిమి
గూరిమి బాంధవులపట్ల గురుజనముల చో
గారవము భృత్యవర్గము
నేర్పుపెఱిఁగి యేలుకొంట నెలఁతకు నీతుల్.

కఱపవలె మీరు భద్రకు
నిరపాయ సుఖంబులిచ్చు నీతిపథంబుల్
వరమీవలె నెవ రెఱిఁగిన
నరవరు నీయట్టి శాంతు నాథు బడయఁగన్."

తపస్విడు పలికె "తథాస్తు"ని:
నెమ్మొగమును దాంచి క్షత్రవిక్రాంతుడుం డ
జెమ్మె నడుమనె మెడఁ గూర్చు
గమ్మవిలుతుమాయ వెడలు కటాక్షశరములఁ దె.

అంతట మదిని గ్రోలెడు
చింత మనమునం దుదోప, శిరమ్ము వంచి దా
వింతతపసి చిత్రాని వినె:
సంతసపరము చేసె చిత్ర యత్నాత్మకమై.

సుభద్ర

రెండవ భాగము

కస్తూరి గన్నేరు కావిచీర మెఱుంగు
మేనిచాయకు వింత మిసిమిఁ గొలుప
చెలరేఁగు ముంగురుల్ చేర్చి కట్టిన జోతి
యురులపైఁ రిక్కలకరణి వెలుఁగ
పైటపైఁ దూగాడు పచ్చలహారముల్
పలదింద్రచాపంబు చాడ్పుఁజూప
సిద్దంపుఁజెక్కులదిద్దిన పత్రముల్
మకరాంక బిరుదాల మాడ్కి వఱల

మెఱపు కెమ్మబ్బు క్రోవల మెఱయునట్లు
వలిపమున మేల్మి మెలిసూలు తళుకులీన
భద్ర నడతెంచె బంగరు పళ్ళెరములఁ
బండ్లు బూవులు గొనుచు సపర్య గొఱకు.

మగనికడ కేగు నెలఁతకుఁ
దగు నీకై నేఁతగాక తపసిని దోడ్తోఁ
నెగఁజూచుట కాదే ! యీ
సొగసరి నీకివి సుమశరము వడిన్.

యతి నియతిఁ గోలుపోని
మ్మతివను గన్నంత మాత్ర ననిమేషత్వం

బతను విభూతియుఁ గాంచడె
యతిపై తాఁబొందఁ జూచుటంతయ కాదే :

మంచినటింతురు తప్పక
వంచనపరులై సవారు; వారిఁగని జనుల్
మంచనె పాటింతురు; మఱి
వంచనె వంచకుని చెఱచి వంచించుఁ దుదన్.

యతిమీదికి మతిపోవుట
మతిపోవుట గాఁ దలంచి మానిని యెంతో
ధృతిఁ గడఁగె మరులు మరులుప
మతి ద్రిప్పినకొలదిఁ జోకు మితిగడచుటయున్.

'పొత్తులనుండఁ బెద్ద లిది పోలునటంచుఁ దలంచినట్టి యా
పొత్తుఁ దలంప కీమగువ పుణ్యవతీతిలకమ్ము నోచె, ము
న్నుత్తగఁ గొంతిదేవి నను నమ్మలకన్నుల పెంపుదక్క యీ
రిత్త తపస్విపై మరులు రేఁగుట కావక మోసపోయితిన్.

నవ్వదొడంగి రీగతికి నావదినె త్రులలూపి ఖిన్నులై
నొవ్వగఁ బల్కఁ జొచ్చిరి కనుంగవ నశ్రులు గ్రమ్మ చేటలీ
రవ్వఁ దలంపఁగాని మది రాల్పడిగుండె నెఱింగెనేని యా
కవ్వడి నొచ్చి చుల్కనగఁ గాంచు గదా యని నాదుశీలమున్.

ఏడు లోకంబుల నెనలేని * విల్లుకాఁ
డెవ్వాఁడటన్న గర్వకిఁయనంగ
తోటివారలపట్ల సౌహార్ద మొనరించు
మేటియెవఁడన కిరీటియనఁగ
నెవరు నేర్పులుగల్గు నెఱజాణుఁడెవఁడన్న
నింద్రజుండని లోక మెన్ని పల్క
పెద్దలకడ భక్తి పిన్నలయెడ రక్తి
నెరపువాఁడెవఁడన్న నరుఁడెయనఁగ

వీను లలరంగ వినివిని వేడ్కగదుర
నరుని నా వానిగాఁ గొన్న నాతి నిపుడు
నాకు నాలోన వింతయ్యె నరుని మఱచి
మాయయతి నొక్కరునిగాంచి మరులుకొంట.

జగదేక వీరునకు నే
నగుదును దగు వీరపత్నినని తలఁచి మదిం
దగిలి విలువిద్య నేర్చితి
నగవుగదా తపసి కప్పనము నేఁత కదున్.

ఏనొల్లను యతికడకేఁగఁ
గానిమ్మమైన; నరుఁడు గానలలోనన్
గాని యగచాట్లుఁ గుందగ
గానక నేఁ దిరుగుచుంటిఁ గఠినహృదయనై.

* విలుకాఁడెవండనియన్నఁ గర్వడియనంగ — అని పాఠాంతరము.

అని కన్నీరు దలచుచుండఁగా
గనుఁగవ నుప్పొంగి పాఱెఁ గన్నీరుః పఱ
గ్గనరాదని పడకింటికిఁ
జని పానుపుఁజేరి కడువిషాదమునఁ జెందెన్.

సుభద్ర

మూడవ భాగము

పంచిరి రాచబిడ్డ నొక పాంథతపస్వి సపర్యకై గురుల్
మంచిదలంచి; చేకురక మానునె; నీవిటువారి పంపు ల
క్షించి పరిత్యజించి విరసించితి వేమొకొ యేమికీడు శం
కించితివో యటంచు యతి కించల పాల్పడి వేగుచుండఁడే.

తెత్తును నరునని యతి వా
గ్దత్తము గృష్ణునకుఁ జేసెగాన వినుము నీ
తత్తరము మాని జనుమ యు
దాత్తుండెంతేనిఁ దపసి తప్పునె పలుకుల్.

యతి నొకనిఁ గుడుపఁ జేకుఱు
నతివేలంబైన భాగ్యమనఁడే హరి. నీ
మతకరివదినెల మాటలఁ
గుతుకమతియు మారకుంట కూడునె చెప్పుమా.

కాలము దేశము సిద్ధుల
పాలై యాజ్ఞలను మెలఁగు; బార్థుని నీకై
శీల మెయిం గొనఁగా యతి
చాలదె? పంతలనుమాని చనుమా వేడ్కన్.

కాదని యాదవవీరులఁ
గాదని నీ పెద్దయన్నఁ గవ్వడికొఁగి వి

న్నిఁ దగు ప్రియుడు కావలె
మొదల మిన్నేఱు దాల్చు నాఢ్యుం డొకడే.

కారాదొకొ యతి యీశుఁడు
రారాదొకొ నన్నుఁ బ్రోవ రమణిరొ వటుఁడై
తాఁ రాఁడొకొ యిటకు నరా
కారంబన నెంత యతికిఁ గరుణఁ గలిగినన్.

సిగ్గఱవలె నొక్కొక తఱి
నెగ్గులఁ దొలగింపఁ గోరు నింతలు; దాన
లగ్గులు చేకుఱు మరి నే
సిగ్గని నాఁ దూరకున్నఁ జిక్కెనె హరియున్.

కోరి వరించితిఁ గాదే
నారాయణు నేను నాఁడు నాతులలోనన్
పేరుఁ బ్రతిష్ఠయుఁ గాంచనె
పాఱుఁడొకఁడు కాదె నాకుఁ బట్టై నిలిచెన్.

ఉత్తముఁడా తపసి యెడన్
బత్తెంతయుఁ గల్గియుంట భావ్యంబైనన్
జిత్తమున నిన్న మొన్నను
గ్రొత్తతలఁపు వేరుపడ్డఁ గొంకితి పోవన్ ॥

ఋతుశతకము *

స్మితమతి సూచీ భేదిత
ఋత మౌక్తికపదకశతక మిభపతి భాషా
పతి కతి కుతుకత గూర్చగ
సతతము.

పతిప్రేమవృత్తులను గని
పతి నమ్మిక నెగడు రీతి ప్రకృతిసతి యెడన్
మతియుతుడు ఋతము గనుటను
సతతము.

వెత బెట్టకు మిది యిమ్మని
ప్రతిమాలెడు ప్రియుని పల్కు ప్రతిభాషల సు
స్మిత ఋతమున్ వివరింపగ
సతతము.

ఋతము లతియత్న మృగ్యము
లతిగుప్తము లౌట పండ్ల నాకులలోనన్
వెతుకు గతి వెతుకదగువవి
సతతము.

---

* ఋత శతకాన్ని మహాకవి పూర్తిగా వ్రాసివుంటారని నాభావం. నాకు దొరికినంతమటుకు వీటిని పరిష్కరించి వొక క్రమంలో అమర్చి పాఠకులకు అందిస్తున్నాను.

ఋతము గనుట బాహ్యాక్షర
తతి పోల్కియు వేరు తెలివి తలపులగూటుఁ
బు తలప దాని క్రమమ్మని
సతతము.

అతి సుకుమారము ఫలద
మ్మృత వృక్షం బనృతకథ మేచిన దానిన్
హాతిజేసి తరువు గనుమని
సతతము.

కుతప తరుణీ కరశబలీ
కృత వాతాచక్రమనిలకృపి జెడు భంగిన్
ఋతమంటి కల్ల చెడునని
సతతము.

వితథముల బల్కి యొరులకు
వెత జేయునతఁడు వన్నెలు వెట్టి యనృత పా
తతి కీలల తనె పడునని
సతతము.

కతలను రక్కసు నెత్తురు
జితి బడి రక్కసులగు గతి నృతమాతి జంపన్
ఋతములు మితిలేకగునని
సతతము.

అతి తృష్ణాగ్ని పిశాచము
మతి ధర్మపథంబునుండి మరలించు నెడన్
బుతవిధుడె త్రోవ యిడునని
సతతము.

చతురత నశ్వంబును వలె
మతినొంచు విచిత్రగతుల మానవుడేపై
వృశ సత్యవర్తిత్వలం జన
సతతము.

బుతమందు నిలిపి యుంచిన
మతి కుడ్యావృత సముద్ర మధ్యస్థంబై
ద్యుతి జెందు నోడ వలెనని
సతతము.

మతివీణా విక్వణమున
ధృతతంతువు మీటుకున్న నె ట్లావృతమై
శ్రుతిచెడు శ్రావ్యత యెట్లని ?
సతతము.

మతివీణ మీటునంతనె
బుతతంత్రీ శ్రుతినిజేరి యింపుగ స్వరముల్
ప్రతిసంవాదమ్మిడునని
సతతము.

ఋతమతి చూపులు దాకను
మతి విద్యుద్యంత్రమంచు మానిసి పగిదిన్
ధృతిచెడి వికలత గనునని
సతతము.

కితవత గట్టిన సంపద
కుతుకోద్వృతి డించు పేక కోటల రీతిన్
ఋతమంటె నంత చెడునని
సతతము.

ఇతిహాసానృత కోష్టము
లతి కామోద్రేకరచన లందిరి నృపతుల్
ఋతకృతు పొందగ ఋపతికి
సతతము.

మృతభట సంభృత రణ భువి
కుతలపతులు గనిరి కీర్తికుంజరపతికిన్
మృతజీవిక ఋతభువి
సతతము.

గతక్లేశము పొందవు హాయిని
కతలను వినువలన నెట్లు గలుగున్ సుఖముల్
మతిలేక నట్టి పోల్కని
సతతము.

బ్రతుకువిధము దెలియగనగు
ప్రతికి యత్నంబు ద్రోవ తెలిపి వంకవెతల ని
ష్కృ. కరణి గనుటయె యగునని
సతతము.

వెతకదగు నొక్క సత్యము
మతి నరు నొక్కింత ప్రేమ సరిగా జూడన్
నితరము లరయం జనదని
సతతము.

ఋతమునకు ప్రాణమిచ్చిన
మతిమంతు చరిత్ర కాలమార్గము నంపన్
ఋత [illegible] దీపంబనుచున్
సతతము.

మితిమీరి దానవప్ర తా
మృతిదాయక లోహమెత్త మెయిజీవనమా
గతిలోహమెత్తె నరు డిల
సతతము.

వితత కవితాఖని గని కు
మతి కను చెదరు; మతియుతుఁడు కవితల సొంపున్
చతురత నేరిచి గనునని
సతతము.

ధృతి గురు జాడల నరిగెడూ
సగతి పెద్దలు జూప జనితి గజపతి త్రోవన్
కృతి కదె గౌరవముగుటన్
పతతము.